Follow: @ANNTELUGU

ANN తెలుగు

29-01-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 33 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## గరీబోళ్ళ నోటిముద్ద లాగేస్తున్న మోదీ

### మెదక్‌లో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్

ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ తో కలిసి నరేగా బచావో కార్యక్రమం

**మెదక్, మహా:** ప్రధాని మోదీ పేదవాళ్ళ నోటికాడి ముద్దను లాక్కోవాలని చూస్తున్నాడనిటీ పీసీసీ చీఫ్ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని ఖండిస్తూ మెదక్ జిల్లాలో ఎంనరేగా బచావో, బీజేపీ హటావో నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ తో కలిసి పాల్గొన్న ఆయన.. మోదీ సర్కారు గరీబోళ్లను కష్ట పెడుతున్నారని అన్నారు. గరీబోళ్ళకోసం సోనియా గాంధీ అనంతపురం పర్యటనలో ఉన్నపుడు పనికి ఆహార పథకం తీసుకొచ్చారని చెప్పారు. అనంతపురంలో అన్ని ఇళ్లకు తాళాలు ఉంటే...సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ కు చెప్పి పనికి ఆహార పథకాన్ని మొదలు పెట్టారని చెప్పారు. గ్రామ జనం పటిష్టంగా ఉంటే గ్రామాలు సౌభాగ్యంగా ఉంటాయన్నారు. కానీ మోదీ, అదానీ, అంబానీల కోసం పనికి ఆహార పథకాన్ని తొలగించాలని చూస్తున్నారని విమర్శించారు. పనికి ఆహార పథకం కోసం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్ లో పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఫిబ్రవరి నాటికి గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చి 20 ఏళ్లు పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

టాప్ న్యూస్

### ఆధార్ సేవలు ఇకపై ఇంట్లోనే..

- కొత్త యాప్ రిలీజ్ చేసిన కేంద్రం
- ఇంటి నుంచే మొబైల్ నంబర్, అడ్రస్ అప్‌డేట్




03

### అమెజాన్‌లో భారీ లేఆఫ్స్

- 16,000 మంది ఉద్యోగుల తొలగింపు
- మూడు నెలల వ్యవధిలోనే రెండోసారి భారీ లేఆఫ్స్ ప్రకటన

03

### జనసేన కాదు.. కామసేన

- జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వీడియో లీక్‌పై రోజా తీవ్ర ఆగ్రహం
- నగరిలో రోడ్డుపై బైఠాయించి నిరసన



03



# రంగంలోకి సీఎం రేవంత్

- ఫిబ్రవరి 3 నుండి దూకుడే..
- మోతమోగనున్న ప్రచారం
- మిర్యాలగూడతో షురూ..
- నిజామాబాద్ తో ముగింపు

**హైదరాబాద్, మహా :** మునిసిపల్ నగారా మోగగా, ఓ వైపు హార్వర్డ్ యూనివర్శిటీలో తరగతులకు హాజరవుతూనే మరోవైపు తెలంగాణ రాజకీయాలపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు. ఫిబ్రవరి 3తో నామినేషన్ల ఉపసంహరణలు పూర్తవుతుండగా, ఆరోజు నుండే ప్రచార భేరీని సీఎం రేవంత్ మోగించనున్నారు. ప్రతిపక్షాలకు గెలుపు అవకాశం ఇవ్వకుండా సీఎం రేవంత్ రెడ్డితో క్యాంపెయిన్‌కు ఆ పార్టీ తాజాగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఫిబ్రవరి 3న మిర్యాలగూడ సభతో రేవంత్ ప్రచారం ప్రారంభం కానుంది. 4న జగిత్యాల, 5న చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రచార సభలు జరగనున్నాయి. ప్రచార సభలతో సీఎం రేవంత్ పొలిటికల్ హీట్ పెంచనున్నారు.

- ఫిబ్రవరి 3- మిర్యాలగూడ
- ఫిబ్రవరి 4- జగిత్యాల
- ఫిబ్రవరి 5- చేవెళ్ళ
- ఫిబ్రవరి 6- భూపాలపల్లి
- ఫిబ్రవరి 7- మెదక్
- ఫిబ్రవరి 8- నిజామాబాద్



## చైనాలో పెళ్లిళ్లకు దూరం

### పిల్లల్ని కనేందుకు విముఖత

**మహా:** చైనా తీవ్ర జనాభా సంక్షోభంలోకి వెళ్తోంది. దేశంలో జననాల రేటును పెంచేందుకు, యువతను పిల్లల్ని కనేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. గతేడాది దేశంలో జననాల సంఖ్య చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోవడమే ఇందుకు నిదర్శనం. మిగతా 3లో



## పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

### ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**ఢిల్లీ, మహా:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు.

మిగతా 3లో



## మునిసిపల్ ఎన్నికల్లో కేసీఆర్‌ను చూసి ఓటేయండి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 3లో



## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్

# దుర్మరణం

### ల్యాండింగ్ అవుతుండగా పేలిన విమానం

- ప్రాణాలు కోల్పోయిన మరో నలుగురు.. శోక సంద్రంలో అభిమానులు
- ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా తో పాటు పలువురు సంతాపం
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, కిషన్ రెడ్డి పవన్ కల్యాణ్, నారా లోకేష్ తదితరుల సంతాపం
- పవార్ విమాన ప్రమాదంపై దర్యాప్తు ఏక్ నాథ్ షిండే ప్రకటన

**ముంబై, మహా :** మహారాష్ట్రలో ఘోర విషాదం చోటు చేసుకుంది. విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో కుప్పకూలింది). ఈ దుర్ఘటనలో పవార్ (66) తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబయి నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ముంబయి నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలైనట్లు తెలుస్తోంది. విమాన ప్రమాదంపై డీజీసీఏ స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. మిగతా 2లో

### మహారాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేశారు

- సీఎం దేవేంద్ర ఫడ్నవీస్



మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించారని తెలిపారు. రాష్ట్రంలో విషాద వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. పవార్ లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం తీరని లోటన్నారు. వ్యక్తిగత జీవితంలో అజిత్ పవార్ తనకు మంచి స్నేహితుడని, మహారాష్ట్ర అభివృద్ధికి అజిత్ పవార్ కృషి చేస్తున్న తరుణంలో ఆయన అకాల మరణం తీరని లోటని తెలిపారు. పవార్ కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## గగనతలంలో రాలిపోయిన రాజకీయ దిగ్గజాలు 02

## దానం సంచలన ట్విస్ట్

- నేను బీఆర్ఎస్ కు రాజీనామా చేయలే
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కు ఎమ్మెల్యే రిప్లయ్
- 30న హాజరుకావాలని స్పీకర్ నోటీసు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ పాలిటిక్స్ లో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు చోటుచేసుకుంటున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీన తన ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొనగా, ఈ నోటీసులు ఇచ్చిన గంటల వ్యవధిలోనే దానం నాగేందర్ సంచలన ట్విస్ట్ ఇచ్చారు. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని దానం స్పీకర్‌కు తెలిపారు. బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ పై తాజాగా అఫిడవిట్ సమర్పించిన ఆయన పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్ ను కొట్టివేయాలని స్పీకర్ కు దానం విజ్ఞప్తి చేశారు. ఇంతకాలం దానం అడపాదడపా కాంగ్రెస్ లోనే ఉన్నానని, కాంగ్రెస్ గెలుపుకు పనిచేస్తానని చెప్పగా, ఇపుడు ఊహించని రీతిలో టర్న్ తీసుకున్నారు. బీఆర్ఎస్ తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు నాకు సమాచారం లేదని, నేను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని దానం నాగేందర్ స్పష్టం చేశారు. తాను 2024 మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లాను. అది వ్యక్తిగత హోదాలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ భేటీకి హాజరయ్యానని పేర్కొన్నారు. మీడియా కథనాల ఆధారంగా పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నానని, గతంలో కోర్టు తీర్పుల ను అనుసరించి బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదన్నారు. అనర్హత పిటిషన్ తర్వాతి పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దని, పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్ ను కొట్టివేయాలని స్పీకర్ ను కోరారు.

### 30న ఏం జరుగుతుంది?

ఈనెల 30న విచారణకు హాజరుకావాలని స్పీకర్ కోరగా, అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను పరిగణనలోకి తీసుకోవొద్దని దానం కోరారు. మరోవైపు ఫిర్యాదుచేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని కూడా హాజరుకావాలని స్పీకర్ కోరారు. ఫిబ్రవరి 6న అనర్హత పిటిషన్ పై విచారణ జరగనున్న నేపథ్యంలో స్పీకర్ పెండింగ్ విచారణలు పూర్తిచేస్తున్నారు.

## జనసంద్రంగా మారిన మేడారం

నేడే గద్దె మీదికి సమ్మక్క తల్లి ఆగమనం

అన్నీ తానై భక్తులకు అండగా మంత్రి సీతక్క

03

## ఆదిలాబాద్ మునిసిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- కాంగ్రెస్ లోకి బీఆర్ఎస్ నేతలు పర్వేజ్, అన్సార్
- కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి
- ఆదిలాబాద్ బల్దియా గెలవడమే లక్ష్యమని పిలుపు

03



# మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్

# దుర్మరణం



(మొదటిపేజీ తరువాయి)

అజిత్ పవార్‌తో పాటు ముంబయి పీఎస్‌వో వదీప్ జాదవ్, కెప్టెన్ సుమిత్ కపూర్, కెప్టెన్ శాంభవి పాఠక్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి మరణించినట్లు తెలిపింది. ఘోర విషాదంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**ప్రధాని మోదీతో పాటు పలువురు సంతాపం**

మహారాష్ట్రలో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాద ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు, పరిస్థితులపై ఆరా తీశారు. అజిత్ పవార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. అజిత్ పవార్ ప్రజల నాయకుడిగా, గ్రాస్‌రూట్ స్థాయి వరకు బలమైన అనుబంధం కలిగిన వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారని మోదీ పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రజల సేవలో అహర్నిశలు శ్రమించిన కష్టజీవిగా ఆయనకు విశేష గౌరవం ఉందని పోస్టులో రాసుకొచ్చారు. పాలనా వ్యవహారాలపై ఆయనకు ఉన్న అవగాహన, పేదలు అణగారిన వర్గాలను శక్తివంతం చేయాలన్న తపన విశేషమని ప్రధాని ట్వీట్ చేశారు. అజిత్ పవార్ అకస్మాత్తుగా కన్నుమూయడం షాక్‌కు గురిచేసిందని, ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన సానుభూతి అని మోదీ తెలియజేశారు.

**పవార్ విమాన ప్రమాదంపై దర్యాప్తు**
**ఏక్‌నాథ్ షిండే కీలక ప్రకటన!**

అజిత్ పవార్ విమాన దుర్ఘటనలో మరణించారన్న వార్త తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "నా అన్నయ్య పోయాడు. అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్ర యావత్ కన్నీళ్లు పెట్టుకుంటోంది. మొత్తం మహారాష్ట్రకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎవరూ కలలో కూడా దీనిని ఊహించలేదు." ఈ దురదృష్టకర ప్రమాదంపై దర్యాప్తు చేయాలని ఆయన అన్నారు. ఈ విమాన ప్రమాదంలో మా సహచరుడు ప్రాణాలు కోల్పోయారు, ఐదు నుంచి ఆరుగురు మరణించారు, కాబట్టి ఈ విమాన ప్రమాదంపై కచ్చితంగా దర్యాప్తు జరుగుతుంది, తప్పకుండా దర్యాప్తు చేయాలి, ఎందుకంటే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నిరోధించడానికి ఇది అవసరం, ఈ ప్రమాదంపై కూడా దర్యాప్తు చేస్తామని ఏక్‌నాథ్ షిండే తెలియజేశారు. మహారాష్ట్రలో ఈరోజు చాలా విచారకరమైన, హృదయ విదారకమైన ఘటన జరిగింది. ఇది ఎవరూ ఊహించని విషయం, అజిత్ దాదా ఇంత త్వరగా మరణించడం మహారాష్ట్రకు చాలా విచారకరమైన, దురదృష్టకరం. గత చాలా సంవత్సరాలుగా అజిత్ దాదా మహారాష్ట్ర రాజకీయాలను నడిపిస్తున్నారు, ఆయన చాలా స్పష్టమైన ప్రసంగం, పరిపాలనపై ఆయన పట్టును చూశాము, ప్రతి విషయాన్ని అధ్యయనం చేసే, ప్రతిదాని గురించి మాట్లాడే అలవాటు ఆయనకు ఉంది, చాలా స్పష్టంగా, నిర్భయంగా ఉన్నప్పటికీ, ఆయన తప్పును తప్పుగా సరైనదాన్ని సరైనదిగా చెప్పేవాళ్లు. ఆయన చాలా స్వచ్ఛమైనవారు, ఆ విషయం నాకు బాగా తెలుసు అని ఏక్‌నాథ్ షిండే అన్నారు.

**ఉదయాన్నే పని ప్రారంభించేవారు**

నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనతో కలిసి మంత్రివర్గంలో కూడా పనిచేశాను, ఆయన ఉప ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు, మహారాష్ట్రలో లడ్కీ బహిన్ యోజన లేదా మరేదైనా పథకం ప్రారంభించినప్పుడు, అది ఆర్థిక లేదా ఆర్థిక సదుపాయం అయినా, అజిత్ పవార్ దానిని చాలా చక్కగా పరిపూర్ణంగా నిర్వహించారు. ఆయన పని గురించి నాకు బాగా తెలుసు, ఒకసారి ఆయన ఏదైనా చేయాలని నిర్ణయించుకున్న తర్వాత కచ్చితంగా చేసి చూపించేవారు. అది చేయు, అది చేయు, అది చూడు, అది చూడు వంటి పదాలు ఆయన నిఘంటువులో లేవు, అది మంచిదైతే, ఏం చేయాలో ఆయన చెబుతారు, అది చెడ్డదైతే, ఆయన స్పష్టంగా కాదు అని చెబుతారు. నేను అయినా లేదా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అయినా , అజిత్ దాదా, మా పనివేళలు కూడా భిన్నంగా ఉండేవి, కానీ మేము తెల్లవారుజాము వరకు పని చేసేవాళ్ళం, అజిత్ దాదా ఉదయం త్వరగా పని ప్రారంభించేవాళ్లు. అజిత్ దాదా ఉదయం ఆరు గంటలకు కూడా అపాయింట్‌మెంట్ ఇచ్చేవారు, ప్రజాప్రతినిధులు, అధికారులకు కూడా ఆయన గురించి తెలుసు. అటువంటి నాయకుడిని కోల్పోయానని అన్నారు.

## రాజకీయ చాణక్యుడు



**అజిత్ పవార్ 1959 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి అనంత్‌రావ్ పవార్ సీనియర్ రాజకీయ నాయకుడు, మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్‌కు సోదరుడు. బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన అజిత్‌పవార్ 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏళ్ల పాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 1991లో తొలిసారి బారామతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అనంతరం బాబాయి శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి ఎనిమిది సార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. అజిత్ పవార్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. భార్య సునేత్ర పవార్ రాజ్యసభ ఎంపీగా వ్యవహరిస్తున్నారు.**

**రాజకీయాల్లో అన్నయ్యను కోల్పోయిన అనుభూతి**

మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో మేము కలిశాము, చాలా మాట్లాడం. ఈ ఉదయం దుర్ఘటన గురించి తెలిసినప్పుడు అవే విషయాలు గుర్తుకు వచ్చాయి. అవే జ్ఞాపకాలు మైండ్‌లో తిరుగుతున్నాయి. ఆయన రాజకీయాల్లో అనుభవజ్ఞుడైన నాయకుడు, ఆయన వయస్సులో నాకంటే పెద్దవాడు, అనుభవంలో నాకంటే పెద్దవాడు. రాష్ట్రంలోని చాలా సమస్యలపై ఆయనకు చాలా అధ్యయనం చేశారు, ఆయన అనేక శాఖలను నిర్వహించారు, ఆయన రాష్ట్రానికి ఎంతో మేలు చేశారు. అజిత్ పవార్ నిష్క్రమణ ఆయన కుటుంబానికి మాత్రమే కాకుండా మొత్తం మహారాష్ట్రకు తీరని నష్టాన్ని కలిగించింది. గత చాలా సంవత్సరాలుగా ఆయనతో ఏర్పడిన సాన్నిహిత్యం, మేము ముగ్గురం రాజకీయాల్లో కలిసి పనిచేస్తున్నప్పటికీ, రాజకీయాల్లో ఒక అన్నయ్యను కోల్పోయిన అనుభూతి కలుగుతోంది. చాలా బాధను అనుభవిస్తున్నాను. ఆయనకు నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నాను అని షిండే అన్నారు.

**అత్యంత శక్తివంతమైన నేతగా గుర్తింపు**

మహారాష్ట్రలోని బారామతిలో బుధవారం ఉదయం జరిగిన విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా ఆరుగురు మరణించారు. బారామతిలో విమానం ల్యాండ్ అవుతుండగా ఈ ప్రమాదం జరిగిందని ప్రచారం జరిగింది. అజిత్ పవార్ చాలా కాలంగా మహారాష్ట్ర రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. బారామతితో ఆయనకు చాలా అనుబంధం కలిగి ఉంది. ఆయన జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ పదవుల్లో కొనసాగారు. ప్రజలకు సేవ చేశారు. వాటిలో ఉప ముఖ్యమంత్రిగా, ఎన్ సీపీ సీనియర్ నాయకుడిగా చాలా కాలం పనిచేశారు.

**బాబాయ్ శరద్ పవార్ నుంచి రాజకీయ నైపుణ్యాలు నేర్చుకున్న అజిత్ పవార్**

అజిత్ పవార్ రాజకీయ ప్రయాణం ఆయన బాబాయ్ శరద్ పవార్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది, రాజకీయ నైపుణ్యాలు, సంస్థాగత వ్యూహాన్ని నేర్పించారు బారామతి ప్రాంతాన్ని కుటుంబ రాజకీయ కోటగా మార్చారు. అయితే తర్వాత మారిన రాజకీయ పరిస్థితులు, పార్టీలో చీలిక విభేదాలు చాలా అంశాలు మహారాష్ట్ర రాజకీయాలనే కాకుండా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

**1991 లోక్‌సభ ఎన్నికలు, శరద్ పవార్ రాజీనామా**

1991లో బారామతి లోక్‌సభ స్థానాన్ని గెలుచుకోవడం ద్వారా అజిత్ పవార్ జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఈ విజయం కేవలం వ్యక్తిగత విజయం కాదు, శరద్ పవార్ రాజకీయ వ్యూహంలో భాగం. తరువాత, అజిత్ పవార్ తన బాబాయ్ శరద్ పవార్ కోసం ఆ స్థానాన్ని ఖాళీ చేశారు. ఈ నిర్ణయం ఆ సమయంలో అజిత్ పవార్ పూర్తిగా శరద్ పవార్ నాయకత్వంలో పనిచేస్తున్నారని నిరూపించింది.

**అడ్మినిస్ట్రేటివ్ స్కిల్స్ స్కూల్**

శరద్ పవార్ తో కలిసి పనిచేయడం వల్ల అజిత్ పవార్ అనేక పరిపాలనా పాఠాలు నేర్చుకున్నారు. వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, సమయపాలన పాటించడం, అధికారులు, ప్రజల మధ్య సమతుల్యతను కాపాడుకోవడం, సంక్షోభ సమయాల్లో కఠినమైన కానీ ఆచరణాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఆయనకు బాగా వంటపట్టింది. ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా శరద్ పవార్ అనుభవం అజిత్ పవార్ కు శిక్షణా స్థలంగా పనిచేసింది.

**అజిత్ పవార్ గొప్ప వ్యక్తి: ఆశిష్ షెలార్**

అజిత్ పవార్ మృతిపై మహారాష్ట్ర మంత్రి, బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ ఆశిష్ షెలార్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అజిత్ పవార్ సేవలను కొనియాడారు. అనంతరం మీడియాతో ఆశిష్ షెలార్ మాట్లాడారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ గొప్ప వ్యక్తి అని చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారని తెలిపారు. అలాంటి వ్యక్తి అకస్మాత్తుగా హఠాన్మరణం చెందడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అజిత్ పవార్ నీతి నిజాయితీ కలిగిన వ్యక్తి అని కీర్తించారు.



## గగనతలంలో రాలిపోయిన రాజకీయ దిగ్గజాలు

### దేశాన్ని కుదిపేసిన విమాన ప్రమాదాలు

**మహా :** భారత రాజకీయ చరిత్రలో విమాన ,హెలికాప్టర్ ప్రమాదాలు ఎన్నో విషాదాలను నింపాయి. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన అగ్రశ్రేణి నాయకులు, భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదుగుతారని భావించిన వారు సైతం ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం దేశానికి తీరని లోటును మిగిల్చింది. బుధవారం అజిత్ పవార్..నిన్నటి విజయ్ రూపానీ మరణం వరకు, గడిచిన దశాబ్దాల్లో గగనతల ప్రమాదాలు భారత రాజకీయ రంగానికి తీవ్ర నష్టం చేశాయి.

**హెలికాప్టర్ ప్రమాదాల్లో చనిపోయిన వైఎస్ , బాలయోగి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా వెలుగొందుతున్న సమయంలో వైఎస్ రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదానికి గురయ్యారు. సెప్టెంబర్ 2, 2009న చిత్తూరు జిల్లాలో 'రచ్చబండ' కార్యక్రమానికి వెళ్తుండగా, ఆయన ప్రయాణిస్తున్న బెల్ 430 హెలికాప్టర్ నల్లమల అడవుల్లోని పావురాల గుట్ట వద్ద కూలిపోయింది. ప్రతికూల వాతావరణం కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో వైఎస్ఆర్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. లోక్‌సభ స్పీకర్‌గా అత్యున్నత పదవిలో ఉన్న జి.ఎమ్.సి. బాలయోగి 2002, మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో కన్నుమూశారు. కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలో సాంకేతిక లోపం తలెత్తడంతో పైలట్ హెలికాప్టర్‌ను చెరువులో అత్యవసరంగా దించే ప్రయత్నం చేశారు. కానీ, అది విఫలమై కూలిపోవడంతో బాలయోగి అక్కడికక్కడే మరణించారు. ఇది తెలుగువారందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన ఘటన.

**సంజయ్ గాంధీ, సింధియా కూడా !**

జాతీయ స్థాయిలో సంజయ్ గాంధీ విమాన ప్రమాదం దేశ రాజకీయ గమనాన్ని మార్చేసింది. ఇందిరా గాంధీ రాజకీయ వారసుడిగా ఎదిగిన ఆయన, ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం సమీపంలో చిన్న విమానంతో విన్యాసాలు చేస్తుండగా నియంత్రణ కోల్పోయి ప్రమాదానికి గురయ్యారు. అదేవిధంగా, 2001లో కాంగ్రెస్ దిగ్గజం మాధవరావు సింధియా ప్రయాణిస్తున్న ప్రైవేట్ విమానం ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి వద్ద కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆయనతో పాటు పలువురు జర్నలిస్టులు కూడా ప్రాణాలు కోల్పోయారు. సింధియా మరణం అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి భర్తీ చేయలేని లోటుగా మిగిలిపోయింది.

**బల్వంత్రాయ్ మెహతా**

గుజరాత్ రెండో ముఖ్యమంత్రిగా పనిచేసిన బల్వంత్రాయ్ మెహతా మరణం యుద్ధ తంత్రాన్ని గుర్తు చేస్తుంది. 1965 భారత్‌పాక్ యుద్ధ సమయంలో సరిహద్దు ప్రాంతాలను పర్యవేక్షించేందుకు ఆయన వెళ్లారు. అయితే, ఆయన ప్రయాణిస్తున్న విమానాన్ని శత్రుదేశమైన పాకిస్థాన్‌కు చెందిన యుద్ధ విమానం కూల్చివేసింది. యుద్ధ సమయంలో ఒక ముఖ్యమంత్రి ఇలా మరణించడం దేశ చరిత్రలోనే అత్యంత విషాదకరం.

**దోర్జీ ఖండు, ఓ.పి. జిందాల్**

అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న దోర్జీ ఖండు 2011లో తవాంగ్ నుంచి ఇటానగర్ వెళ్తుండగా మంచుకొండల్లో హెలికాప్టర్ కూలిపోయి మరణించారు. ఐదు రోజుల గాలింపు తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది. అలాగే, ప్రముఖ పారిశ్రామికవేత్త మరియు హర్యానా మాజీ మంత్రి ఓ.పి. జిందాల్ 2005లో చండీగఢ్ వెళ్తుండగా ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ సమీపంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు విడిచారు.

### దేశ రక్షణ రంగానికీ ఎంతో నష్టం

**ఈ విమాన ప్రమాదాలు కేవలం రాజకీయ నేతలనే కాకుండా దేశ రక్షణ రంగాన్ని కూడా కుదిపేశాయి. 2021 డిసెంబర్ 8న భారత తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ ప్రయాణిస్తున్న ఎంఐ-17 హెలికాప్టర్ తమిళనాడులోని కూనూర్ వద్ద కూలిపోయింది. పొగమంచు వల్ల పైలట్ అయోమయానికి గురికావడం ఈ ప్రమాదానికి కారణమని దర్యాప్తులో తేలింది. ఈ ఘటనలో రావత్ దంపతులతో పాటు మరో 12 మంది సైనిక అధికారులు అమరులయ్యారు. ఇది దేశ రక్షణ వ్యవస్థకు పెద్ద దెబ్బ. శాస్త్ర సాంకేతిక మరియు స్వాతంత్ర్య సమర చరిత్రలోనూ ఇలాంటి చేదు జ్ఞాపకాలు ఉన్నాయి. భారత అణు విజ్ఞాన పితామహుడు హోమీ జహంగీర్ బాబా 1966లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించగా, 1945లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ తైవాన్ విమాన ప్రమాదంలో అదృశ్యమవ్వడం ఇప్పటికీ ఒక వీడని మిస్టరీగానే ఉంది. ఈ ప్రమాదాలన్నీ విమానయాన భద్రతపై మరియు వీఐపీల ప్రయాణాలపై ఎన్నో ప్రశ్నలను, పాఠాలను మిగిల్చాయి. వాతావరణ పరిస్థితులు, సాంకేతిక లోపాలు లేదా మానవ తప్పిదాలు ఏదైనప్పటికీ.. ఈ ఆకస్మిక మరణాలు భారత రాజకీయ చిత్రపటంపై ఎప్పటికీ మాసిపోని గాయాలనే మిగిల్చాయి.**





## ప్రభావవంతమైన నేతల్లో ఒకరిగా గుర్తింపు

కాలక్రమేణా, అజిత్ పవార్ తనను తాను శరద్ పవార్ మేనల్లుడి కుమారుడిగా మాత్రమే పరిమితం చేసుకోలేదు. నీటిపారుదల, ఆర్థికం, పరిపాలన వంటి కీలక విభాగాలలో సేవలందిస్తూ, తన పని తీరుతో తనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. చాలా కాలం పాటు, మహారాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత ప్రభావవంతమైన నాయకుల్లో ఒకరిగా మారారు. బారామతి ప్రాంతంలో ఆయన రాజకీయ ఆధిపత్యం బలపడింది. అలా బాబాయ్ నుంచి రాజకీయ పాఠాలు నేర్చుకొని మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ దాదా అని అభిమానులు అప్యాయంగా పిలుచుకునే స్థాయికి ఎదిగారు. శరద్, అజిత్ మధ్య గురు శిష్యుల సంబంధం ఉంది. కానీ జీవితంలో, రాజకీయాల్లో ఏ సమీకరణం శాశ్వతం కాదు. అందుకే, బహుశా, వారి రాజకీయ కెరీర్ సంధ్యా సమయంలో అజిత్ , శరద్ మధ్య చీలిక స్పష్టంగా కనిపించింది. అజిత్ బారామతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 1991లో జరిగిన ఉప ఎన్నికల్లో అజిత్ తొలిసారి విజయం సాధించారు. తరువాత, 1995, 1999, 2004, 2009, 2014లో వరుసగా ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో అజిత్ విజయం సాధించారు. 1991 నుంచి 1992 వరకు, ముఖ్యమంత్రి సుధాకర్‌రావు నాయక్ ప్రభుత్వంలో వ్యవసాయం, విద్యుత్ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత, 1992లో, శరద్ పవార్ ముఖ్యమంత్రి అయినప్పుడు, ఆయన భూసార పరిరక్షణ, విద్యుత్, ప్రణాళిక శాఖ సహాయ మంత్రి అయ్యారు. 1999లో, కాంగ్రెస్-ఎన్‌సిపి సంకీర్ణ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రి అయ్యారు. 2003లో, ఆయన సుశీల్ కుమార్ షిండే మంత్రివర్గంలో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు స్వీకరించారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-ఎన్‌సిపి కూటమి విజయం సాధించిన తర్వాత , ఆయన దేశ్‌ముఖ్, తరువాత అశోక్ చవాన్ మంత్రివర్గాలలో జల వనరుల మంత్రిగా పనిచేశారు. ఇంతలో, తన బాబాయ్ శరద్ పవార్ తో పార్టీలో విభేదాలు తలెత్తాయి. ఆ విభేదాలు మొదట 2019లో వెలుగులోకి వచ్చాయి. ఆ సంవత్సరం నవంబర్ 23న ఆయన ఎన్ సీపీని వీడి బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో చేరి ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఆ సమయంలో, ఆ ప్రభుత్వంలో మెజారిటీని నిరూపించుకోవడానికి, తనకు మద్దతు ఇస్తున్న ఎన్ సీపీ ఎమ్మెల్యేల సంతకాలతో గవర్నర్‌కు ఒక పత్రాన్ని కూడా సమర్పించారు. అయితే, 80 గంటలలోపు, మహారాష్ట్రలో రాజకీయాల చక్రాలు తిరిగాయి. అజిత్ మళ్ళీ తిరిగి సొంత గూటికి వచ్చారు. 2022లో, శివసేన విడిపోయినప్పుడు మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడి ప్రభుత్వం కూలిపోయింది. తిరుగుబాటు శివసేన వర్గం, బిజెపి కలిసి ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఆ సమయంలో, అజిత్ పవార్ మహారాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకుడయ్యారు. 2023 నాటికి, బాబాయ్, మేనల్లుళ్ల మధ్య దూరం, అధికారం కోసం తహతహలాడే అన్నీ పార్టీలో స్పష్టంగా కనిపించాయి. ఆ సంవత్సరం జూలై 2న, అజిత్ పవార్, తన మద్దతుదారుల ఎమ్మెల్యేలతో కలిసి, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్ సీపీని విడిచిపెట్టి, మహారాష్ట్రలో శివసేన-బీజేపీ కూటమిలో చేరారు. ఆయన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ రాజకీయ మార్పు ఎన్ సీపీలో పెద్ద చీలికకు దారితీసింది.

# జనసంద్రంగా మారిన మేడారం

## నేడే గద్దె మీదికి సమ్మక్క తల్లి ఆగమనం.. అన్నీ తానై భక్తులకు అండగా మంత్రి సీతక్క



**వరంగల్ మహా;** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర మొదలైంది. బుధవారం గిరిజన సాంప్రదాయ పద్ధతిలో కట్టుదిట్టమైన భద్రత మధ్య గద్దె మీదికి సారలమ్మ తీసుకురాగా అదేవిధంగా నేడు సమ్మక్క తల్లి గద్దె మీదికి చేరింది. మేడారం మహా జాతరకు పోదాము అంటూ భక్తజనం కదిలింది. వందు కునేందుకు సరుకులు.. కోళ్లు, గొర్రెలు, వన దేవతలకు మొక్కులు తీర్చుకునేందుకు బెల్లం (బంగారం) ముద్దలు, పసుపు, కుంకుమ, ఒడిబియ్యాన్ని ఎడ్ల బండ్లు, ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో వేసుకొని 'జై సమ్మక్కజై జై సారలమ్మ' అంటూ పిల్లా జెల్లాను వెంట బెట్టుకొని మేడారానికి చేరుకున్నారు. రాష్ట్రం నలువైపుల నుంచే కాదు.. పొరుగున ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మేడారం మహాజాతర మొదలయ్యేది బుధవారము నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు రోజుకో ప్రధాన ఘట్టంతో మహాజాతర భక్తులను ఆనందపారవశ్యంలో ముంచెత్తనుంది. గద్దెల ఆధునికీకరణ, ప్రాకారాలు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వంటి అభివృద్ధి, ఆధునికీకరణ పనులను ప్రభుత్వం చేపట్టి పూర్తిచేయడంతో మహాజాతర ఈసారి భక్తులకు సరికొత్త అనుభూతిని మిగల్చనుంది. ఇప్పటికే భక్తులతో మేడారం జనసంద్రంగా మారింది. కాగా వన దేవతల్లో ఒకరైన సమ్మక్క కూతురు సారలమ్మ, సమ్మక్క భర్త పగిడిద్దరాజు, ఆయన తమ్ముడు గోవిందరాజులు గద్దెల పై కొలువు తీరారు మొదలైంది. గురువారం చిలకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని ప్రధాన పూజారి తో పాటు మిగతా పూజారులు రహస్య పూజలు నిర్వహించి ప్రభుత్వ లాంఛనాల మధ్య అమ్మవారు గద్దెను చేరుకుంటుంది.

**200 ఏళ్లపాటు చెక్కు చెదరని అభివృద్ధి పనులు**

మేడారం మహా జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు పూర్తిచేసింది. జాతర కోసం రూ.251 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.150 కోట్లు జాతరలో భక్తులకు మౌలిక వసతులకు, రూ.90 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు, గద్దెల పునరుద్ధరణ, ప్రాకారం విస్తరణకు కేటాయించారు. మరో రూ.11 కోట్ల నిధులను అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, గద్దెల నుంచి జంపన్నవాగు దాకా రోడ్డు విస్తరణకు కేటాయించారు. గద్దెలు, ప్రాంగణాన్ని గ్రానైట్ శిలలతో ఆధునికీకరించారు. 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా శిలలపై ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, చరిత్ర వివరాలతో కూడిన శిల్పాలు, చెక్కారు. వనదేవతల గద్దెలను ఒకే వరుసలో నిర్మించారు. జాతర కోసం ప్రభుత్వం 21 శాఖలకు చెందిన 42,027 మంది ఉద్యోగులు, సిబ్బందిని నియమించారు. 13 వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా జాతరలో పిల్లలు తప్పిపోకుండా క్యూఆర్ కోడ్‌తో కూడిన రిస్ట్ బ్యాండ్‌లను అందుబాటులోకి తెచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి మేడారం వరకు నిఘా నేత్రాలను అమర్చి ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. అలాగే జాతర సమాచారం కోసం తొలిసారి ప్రభుత్వం వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 7658912300 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపితే జాతరకు సంబంధించిన రూట్ మ్యాప్, ట్రాఫిక్ తదితర పూర్తి వివరాలను అందిస్తారు. మేడారం జాతర లో ఎదురుకోళ్ల సందడి, శివశక్తుల పూనకాలతో పులకించి పోతున్న శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర పసిపిల్లలు, వృద్ధులు ప్రతి ఒక్కరూ జై సమ్మక్క తల్లి జై సారక్క తల్లి అంటూ నినాదాలు చేస్తూ భక్తి భావంతో పులకించి పోతూ ముందుకు సాగుతున్నారు. ఈ మహా జాతరలో భక్తులకు, సామాన్య ప్రజలకు ఎవరికీ ఇబ్బందులు కలగకుండా అన్నీ తానై మంత్రి సీతక్క స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



# ఆదిలాబాద్ మునిసిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- కాంగ్రెస్ లోకి బీఆర్ఎస్ నేతలు పర్వేజ్, అన్సార్
- కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి
- ఆదిలాబాద్ బల్దియా గెలవడమే లక్ష్యమని పిలుపు

**ఆదిలాబాద్ మహా :** మున్సిపల్ ఎన్నికల్లో 40 స్థానాలు గెలిచి ఆదిలాబాద్ బల్దియా పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి పట్టణంలోని 32వ వార్డు ఖానాపూర్ కాలనీలో జరిగిన భారీ చేరికల సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక కాంగ్రెస్ శ్రేణులు , కాలనీ వాసులు బాణసంచా కాల్చి ,గుస్సాడీ నృత్యాలు ఏర్పాటు చేసి పూలు చల్లుతూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. సభా వేదిక వరకు గుర్రం సవారి ఎక్కించి ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారిపొడవునా కేరింతలతో నృత్యాలు చేస్తూ భారీ గజమాలతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాత్రివేశలోనూ ఇసుకేస్తే రాలనంత జనం సభకు హాజరయ్యారు. మాజీ మున్సిపల్ చైర్మన్ జహీర్ రంజానీ , ముజాహిదీన్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ వార్డు నుండి తండ్రీ కొడుకులు పర్వేజ్, అన్సార్ ఇద్దరు బీఆర్ఎస్ కీలక నేతలు కాంగ్రెస్ లో చేరడంతో ఇక ఇక్కడ బీఆర్ఎస్ ద్వారాలు మూసుకుపోయాయన్నారు. ఇక బీజేపీ తోనే పోటీ అని ఆ పార్టీని సింగల్ డిజిట్ కే పరిమితం చేయాలని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని అందరూ ఆశీర్వదిస్తే అనుకున్నట్టు 40 వార్డులు తెలిచితీరుతామన్నారు. ప్రభుత్వం పేదల నుద్దేశించి అనేక సంక్షేమపథకాలు అందిస్తుందని వారందరూ తమ ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఇక ఆదిలాబాద్ పురపాలక పీఠమే లక్ష్యంగా మున్సిపల్ పరిధిలోని ప్రతీ కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త. అభిమాని కష్టపడి పని చేయాలన్నారు. సర్వేలో ఎవరికి టికెట్ వచ్చినా పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరేసి మున్సిపల్ ఎన్నికల పార్లమెంట్ ఇంచార్జి సుదర్శన్ రెడ్డికి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు , సీయం రేవంత్ రెడ్డిలకు కానుకగా ఇవ్వాలన్నారు. ఎన్నికలకు ముగిసేంతవరకు విశ్రమించకుండా పార్టీ గెలుపే లక్ష్యంగా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్, ముడుపు దామోదర్ రెడ్డి, శాంతన్ రావు, గుడిపల్లి నగేష్, ఎంఏ షకీల్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# చైనాలో పెళ్లిళ్లకు దూరం

## పిల్లల్ని కనేందుకు విముఖత

(మొదటిపేజీ తరువాయి)

ఈ పరిణామం చైనా ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తుపై తీవ్రమైన ఆందోళనలను రేకెత్తిస్తోంది. తాజా అధికారిక గణాంకాల ప్రకారం గతేడాది చైనాలో కేవలం 7.92 మిలియన్ల జననాలు మాత్రమే నమోదయ్యాయి. అంతకుముందు ఏడాదితో (9.54 మిలియన్లు) పోలిస్తే ఇది 17 శాతం తక్కువ. 1949 తర్వాత ఇంత తక్కువ జననాలు నమోదు కావడం ఇదే తొలిసారి. ఇదే సమయంలో మరణాల సంఖ్య 11.31 మిలియన్లకు పెరగడంతో మొత్తం జనాభా 3.39 మిలియన్లు తగ్గి 1.4049 బిలియన్లకు చేరింది. ప్రభుత్వ కుటుంబ నియంత్రణ విధానాలు, పిల్లల సంరక్షణ సబ్సిడీలు విఫలమయ్యాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని ఒక మీడియా నివేదిక పేర్కొంది.


# పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

## ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు.

# జమియత్ ఉల్మా కార్యాలయాన్ని ప్రారంభించిన కంది శ్రీనివాస రెడ్డి




**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రజలకు తన సమాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కలగూడ లో నూతనంగా నిర్మించిన జమియత్ ఉల్మా ఎ హింద్ కార్యాలయ భవనాన్ని ఆయన సంస్థ స్టేట్ జనరల్ సెక్రటరీ హఫీజ్ పీర్ ఖలిఖ్ అహ్మద్ సాబిర్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పట్టణంలోని స్ట్రీట్ వెండర్స్ సమస్యలను ప్రభుత్వంతో మాట్లాడి తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ సంతోష్ రావు ముఫ్తి ఇలియాస్ , ముసద్దిఖుల్ ఖాస్మీ ,జమియత్ ఉల్మా ఎ హింద్ జిల్లా అధ్యక్షుడు అబూబకర్, మంజూర్ అహ్మద్ , షేక్ అహ్మద్ ,మౌలానా అస్లాం మౌలానా అబ్దుల్ అజీజ్ , మాజీ మున్సినల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ , పత్తి ముజ్జు, జిల్లా ఖాజీ నదీముద్దీన్, సాజిద్ ఖాన్, సయ్యద్ అన్సార్ జమియత్ ఉల్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా స్థాయి బాలికల స్పోర్ట్స్ మీట్

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల క్రీడా ప్రాంగణం బుధవారం ఉత్సాహంతో కళకళలాడింది. జిల్లా స్థాయి బాలికల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్-2026ను జిల్లా కలెక్టర్ రాజార్షి షా స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మల్లెపూల నర్సయ్య, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ లతో కలిసి ఘనంగా ప్రారంభించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. శాంతి, ఐక్యతకు ప్రతీకగా ఆకాశంలోకి హైడ్రోజన్ బెలూన్లను ఎగురవేయడంతో క్రీడాకారిణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం గర్వకారణమన్నారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి విద్యార్థిని క్రీడా స్ఫూర్తితో పాల్గొని తన ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే గుణం, లక్ష్య సాధనకు కష్టపడే తత్వం క్రీడల ద్వారానే అలవడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని బాలికలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, ఈ పోటీలను తమ ప్రతిభను చాటుకునే మంచి అవకాశంగా మలచుకోవాలని ఆకాంక్షించారు. సంక్షేమ పాఠశాలల విద్యార్థినుల ప్రతిభను ప్రశంసిస్తూ, క్రీడల్లో గెలుపోటములకంటే భాగస్వామ్యమే ముఖ్యమని తెలిపారు. జిల్లా స్థాయి బాలికల ఈ క్రీడా, సాంస్కృతిక పోటీలు మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, క్రీడలు క్రమశిక్షణకు నిలువెత్తు ఉదాహరణలని అన్నారు. మైదానంలో చూపే పట్టుదల, ఆత్మవిశ్వాసం జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే శక్తిని ఇస్తుందని, బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిథులను అధికారులు శాలువాలతో సన్మానించారు పరుగు పందెంలో గెలుపొందిన క్రీడాకారులకు పతకాలను అందించారు. ప్రారంభోత్సవంలో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జాతీయ క్రీడాకారిణి నందిని, అదనపు కలెక్టర్లు శ్యామలదేవి, రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

## 11 వార్డు రాంనగర్ నుండి పెద్ద సంఖ్యలో చేరికలు

## కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని గెలిపించాలని విజ్ఞప్తి

**ఆదిలాబాద్ మహా :** మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దామని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ లో జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 11వ వార్డు నుండి రాజరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ లో చేరారు. వారందరికి కండువాలు కప్పి కంది శ్రీనివాస రెడ్డి పార్టీలోకి స్వాగతించారు. మున్సిపల్ ఎన్నికల ముంగిట పార్టీలోకి చేరికలు జరగడం మంచి పరిణామమన్నారు. ఇంత మంది చేరికతో పార్టీ మరింత బలోపేతమయ్యిందన్నారు.. 40 వార్డుల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో ప్రతిపక్షాలకు తెలియచేయాలన్నారు. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో దాదాపు 60శాతానికి పైగా స్థానాలు గెలుచుకున్నామని అదే ఊపుతో రెట్టించిన ఉత్సాహంతో మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పని చేద్దామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరెంట్, 500 లకు గ్యాస్ సిలిండర్ ,రేషన్ కార్డులు, సన్నబియ్యం లాంటివెన్నో అందిస్తుందన్నారు. మరొక శుభవార్త అంటూ ప్రతీ మహిళకు నెలకు 2500 రూపాయల పథకం త్వరలో రాబోతుందన్నారు. సీయం రేవంత్ రెడ్డి దీనిని త్వరలో ప్రారంభించబోతున్నారంటూ చెప్పారు. అందుకే ఎన్నో మంచి పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఇంచార్జ్ ఆడె గజేందర్, ఆత్మ చైర్మన్ సంతోష్ రావు, దిగంబర్ రావు పాటిల్ , కొండా గంగాధర్ ,,జాఫర్ అహ్మద్ , శ్యాంరావు, తుమ్మ ప్రకాష్, సంటెన్న, సుకేందర్ , శంకర్, మంజుల ,అశోక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ ఎన్నికల్లో కేసీఆర్ ను చూసి ఓటేయండి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకటే అబద్ధం చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో ఏడెనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పు చేశారని వారు చెబుతున్నారని, కానీ పార్లమెంటులో బీజేపీ ఎంపీ ఒకరు అడిగిన ప్రశ్నకు స్పష్టమైన సమాధానం వచ్చిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీఆర్ఎస్ లో చేరగా, ఆయన కండువా కప్పి స్వాగతించారు. ఆరూరి రమేశ్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించారని, కానీ 2023లో 16 వేల ఓట్లతో ఓడిపోయారని అన్నారు. కానీ ఈసారి భారీ మెజారిటీతో వర్ధన్నపేటలో ఆరూరి రమేశ్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే దయచేసి కొత్త, పాత అని చూడవద్దని, అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ రోజు ఓపిక లేని, తెలివి లేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. మున్సిపల్ ఎన్నికలు మొదలు ప్రతి ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌ను చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. టిక్కెట్ ఎవరికి ఇచ్చారనే విషయం ఆలోచించవద్దని, గులాబీ కండువా కప్పుకుని వస్తే కేసీఆర్‌గా భావించి ఓటు వేయాలని సూచించారు. కుటుంబం అన్నాక విభేదాలు ఉంటాయని, కానీ బీఫామ్ ఇచ్చాక అందరూ కలిసి పోవాలని అన్నారు.

**అలా జరిగింది**

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, కడియం శ్రీహరి లాంటి వ్యక్తుల వల్లే తాను పార్టీ నుంచి బయటకు వెళ్లవలసి వచ్చిందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక మంది మీద బురద చల్లి వారు రాజకీయంగా ఎదగకుండా చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని ఆరోపించారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డితో ములాకత్ కుదుర్చుకొని, వరంగల్ జిల్లాలో అనేక మంది ఓటమికి కారణమైన వ్యక్తి కడియం శ్రీహరి అన్నారు.

# అమెజాన్‌లో భారీ లేఆఫ్స్

**మహా:** ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 16,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు వెల్లడించింది. మూడు నెలల వ్యవధిలో కంపెనీ ఇంత పెద్ద మొత్తంలో ఉద్యోగాల కోత విధించడం ఇది రెండోసారి. సంస్థలో చేపడుతున్న అదనపు సంస్థాగత మార్పులలో భాగంగానే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ విషయంపై అమెజాన్ పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గెల్లెట్టి ఒక బ్లాగ్ పోస్ట్‌లో స్పందించారు. "ఇది కష్టమైన వార్త అని నాకు తెలుసు. సంస్థను బలోపేతం చేసేందుకు, అనవసరమైన లేయర్‌లను తగ్గించి, యాజమాన్య బాధ్యతను పెంచేందుకు అక్టోబర్‌లో ప్రారంభించిన ప్రక్రియను కొన్ని బృందాలు ఇప్పుడు పూర్తి చేశాయి" అని ఆమె వివరించారు. ఈ క్రమంలోనే సుమారు 16,000 ఉద్యోగాలపై ప్రభావం పడుతోందని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగం కోల్పోయిన వారికి అండగా ఉంటామని అమెజాన్ హామీ ఇచ్చింది.

# జనసేన కాదు.. కామసేన

## జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వీడియో లీక్‌పై రోజా తీవ్ర ఆగ్రహం

## నగరిలో రోడ్డుపై బైఠాయించి నిరసన



**తిరుపతి, మహా :** జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు సంబంధించిన రాసలీలల వీడియో వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది జనసేన కాదని, మహిళల జీవితాలతో ఆడుకుంటున్న 'కామసేన' అని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే శ్రీధర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ఆమె సొంత నియోజకవర్గమైన నగరిలో వైసీపీ శ్రేణులతో కలిసి భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళనలో భాగంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప తదితరులతో కలిసి రోజా ఏజేఎస్ కళ్యాణ మండపం నుంచి ఓం శక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార మదంతో ఒక మహిళా ఉద్యోగిని బెదిరించి, ఆమె జీవితాన్ని నాశనం చేసిన కీచక ఎమ్మెల్యేను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఆడవాళ్లకు అన్యాయం చేస్తే రోమాలు పీకేస్తా, చర్మం ఒలుస్తా అని ఊగిపోయే పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ? ఏం చేస్తున్నారు?" అని సూటిగా ప్రశ్నించారు. "గతంలో జానీ మాస్టర్, కిరణ్ రాయల్, వినూత్న వంటి వారు తప్పు చేసినప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే, ఈరోజు మీ ఎమ్మెల్యే శ్రీధర్ ఇంతటి దుశ్చర్యకు పాల్పడేవాడా?" అని నిలదీశారు. వీడియోలో ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, త్రీమెన్ కమిటీ వేసి కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీలు, స్పెషల్ ఫ్లైట్ల కోసమే పవన్ రాష్ట్రానికి వస్తారని, ప్రజల కష్టాలను పట్టించుకోరని ఆరోపించారు.

# ఆధార్ సేవలు ఇకపై ఇంట్లోనే...

## కొత్త యాప్ రిలీజ్ చేసిన కేంద్రం

## ఇంటి నుంచే మొబైల్ నంబర్, అడ్రస్ అప్‌డేట్

**మహా:** ఆధార్ కార్డు వినియోగదారులకు భారత విశిష్ట ప్రాధికార సంస్థ శుభవార్త చెప్పింది. ఆధార్ సేవలను మరింత సులభతరం చేస్తూ సరికొత్త ఫీచర్లతో కూడిన కొత్త ఆధార్ యాప్ పూర్తి వెర్షన్‌ను బుధవారం అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా పౌరులు ఇకపై ఇంటి నుంచే అనేక ఆధార్ సంబంధిత సేవలను సులభంగా పొందవచ్చు. ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే కీలకమైన మార్పులు చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. గతంలో ఉన్న ఎంఆధార్ యాప్ కంటే ఈ కొత్త యాప్ ఎన్నో ఆధునిక ఫీచర్లను అందిస్తోంది. వాస్తవానికి ఈ యాప్‌ను 2025 నవంబర్‌లో పరిచయం చేసినా, ఇప్పటివరకు పరిమిత సేవలు మాత్రమే అందుబాటులో ఉండేవి. తాజాగా పూర్తిస్థాయి వెర్షన్‌ను విడుదల చేయడంతో మొబైల్ నంబర్, ఇంటి చిరునామా వంటి వివరాలను ఇంటి నుంచే అప్‌డేట్ చేసుకోవచ్చు. యాప్‌లోని ప్రొఫైల్ సెక్షన్‌లో ఒకేసారి తమ కుటుంబ సభ్యులకు చెందిన 5 ఆధార్ కార్డులను యాడ్ చేసుకుని, వాటిని కూడా నిర్వహించుకునే వీలుంది. ఈ కొత్త యాప్‌లో భద్రతకు పెద్దపీట వేశారు. 'సెలెక్టివ్ షేర్' ఆప్షన్ ద్వారా ఆధార్ నంబర్ మొత్తం చెప్పకుండానే ఆఫ్‌లైన్‌లో గుర్తింపును ధ్రువీకరించుకోవచ్చు. ఈ ఫీచర్‌తో యూజర్లు తమ ఫొటో, పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి వివరాల్లో వేటిని షేర్ చేయాలో ఎంచుకోవచ్చు. దీనివల్ల గోప్యతకు భంగం కలగకుండా గుర్తింపును ధ్రువీకరించుకోవడం సాధ్యమవుతుంది. దీంతో పాటు బయోమెట్రిక్ లాకింగ్ (వేలిముద్ర, ముఖం, కనుపాప లాక్) ఫీచర్‌తో అదనపు భద్రతను పొందవచ్చు.

# నామినేషన్ల వేసే క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** 2 వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఆశావాదులు నామినేషన్ల వేసే క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జె సంపత్ తో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నేటి నుండి జనవరి 30 వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు చెందిన అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. నామినేషన్ వేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయం జనవరి 30 సాయంత్రం 5 గంటలలోగా కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మునిసిపాలిటీలో వివిధ వార్డులకు వచ్చిన నామినేషన్లను పరిశీలించి జనవరి 31 అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన విడుదల చేస్తామని వివరించారు. ఫిబ్రవరి 1 నాడు నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, ఫిబ్రవరి 2 నాడు అభ్యంత ఫిర్యాదుల పరిష్కారం, 3 నాడు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన చేస్తామని పేర్కొన్నారు. 11 ఫిబ్రవరి న పోలింగ్, 12 న రీపోలింగ్, 13 నాడు ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736 250501 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల ఏమైనా మీ దృష్టికి వస్తే సమాచారం అందించాలని పేర్కొన్నారు.

EDITORIAL సంపాదకీయం

# దావోస్‌లో మరోసారి తెలంగాణ ధమాకా

రాజనీతిజ్ఞుడు చాణక్య ఆర్థిక రంగంపై చేసిన సూచనలు వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వ పాలకులకు కూడా కీలకమైనవి. చాణక్య నీతి ప్రకారం అందుబాటులో ఉన్న వనరులన్నింటినీ పూర్తిగా సద్వినియోగం పరుచుకుంటూ, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటే ఆర్థిక ఇబ్బందులు లేకుండా, ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ పేదరికాన్ని నిర్మూలించవచ్చు. ఈ సూత్రాన్ని తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తుంది. రాష్ట్ర భవిష్యత్, అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ఇందుకు కావాల్సిన ఆర్థిక వనరులను పెంచుకోవడామే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం వేస్తున్న అడుగులు విజయవంతం అవుతున్నాయి. దావోస్ వేదికగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తూ గత రెండు పర్యాయాలు భారీ పెట్టుబడులు సాధించిన తెలంగాణ ఇప్పుడు మరోసారి 2026లో కూడా దావోస్ సమ్మిట్‌ను దిగ్విజయంగా వినియోగించుకుంది. గ్రేటర్ హైదరాబాద్ లో ఇటీవల జరిగిన '2025 గ్లోబల్ సమ్మిట' '2026 దావోస్ సమ్మిట' తెలంగాణలో పెట్టుబడులకు సోపానంగా మారింది.

రాష్ట్రం ప్రగతి పథంలో పయనించాలంటే బలమైన ఆర్థిక పునాదులుండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2024 నాటికి వందేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో మన రాష్ట్రం అగ్రగామిగా నిలవాలని 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. 2025 గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 5.75 లక్షల రూపాయాల పెట్టుబడులు సాధించింది. అంతేకాక ఈ సమావేశాలతో రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తెలంగాణ నిర్దేశించుకున్న లక్ష్యాలు ప్రపంచానికి చాటిచెప్పడంలో '2026 దావోస' వేదికగా జరిగిన రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం నెరవేరింది. 2026 జనవరి 20 నుండి 22 వరకు మూడు రోజుల దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కూడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించింది. ఏఐ, సస్టైనబిలిటీ, స్కిల్లింగ్ వంటి కార్యక్రమాలకు సంబంధించి పలు కంపెనీలతో ఎమ్ఓయూలు కుదుర్చుకుంది.

స్విట్జర్లాండ్‌లోని దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ బృందం పలు దేశ, విదేశీ కంపెనీలతో పెట్టుబడులపై అవగాహన కుదుర్చుకుంది. రూ.12,500 కోట్లతో రష్మి గ్రూప్ స్టీల్ ఫ్యాక్టరీ, రూ.6000 కోట్లతో న్యూక్లర్ సంస్థ విద్యుత్ ప్లాంట్, రూ.3500 కోట్లతో లోరియల్ జీసీసీ, రూ.వెయ్యి కోట్లతో సర్గాడ్ విమానాల మరమ్మతు యూనిట్ ఏర్పాటు, రూ.5 వేల కోట్ల పెట్టుబడితో 'యూపీసీ వోల్డ' డేటా సెంటర్, రూ.623 కోట్లతో స్నైడర్ సంస్థ యూనిట్ల విస్తరణ, నెదర్లాండ్స్ కు చెందిన యూపీసీ రెన్యూవబుల్స్ గ్రూప్ 100 మెగావాట్ల సామర్థ్యంతో ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్, రూ.150 కోట్లతో గోద్రేజ్ డెయిరీ ప్లాంట్ విస్తరణకు దావోస్ వేదికగా తెలంగాణతో అవగాహన కుదుర్చుకున్నాయి. ఇవే కాక మరిన్ని కంపెనీలు కూడా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తూ ప్రణాళికలు రూపొందిస్తూ తెలంగాణ బృందంతో చర్చలు జరిపాయి. కంపెనీలు, పెట్టుబడులతో రాష్ట్రంలో ఉద్యోగావశకాలు కూడా పెరగనున్నాయి. ఉదాహరణకు.. రష్మి స్టీల్ ప్లాంట్ తో 12 వేల మందికి, యూపీసీ వోల్డ్ డేటా సెంటర్ ద్వారా 4 వేల మందికి, యూపీసీ రెవెన్యుబుల్స్ కంపెనీతో నిర్మాణ దశలోనే 3 వేల మందికి ఉపాధి లభించనుంది. లోరియల్ కంపెనీ తన కొత్త గ్లోబల్ టెక్ హబ్ ఏర్పాటు కోసం హైదరాబాద్ ను ఎంచుకోవడంతో ఏఐ నిపుణులు, టెక్ ఇంజినీర్లు, డేటా సెంటిస్టులకు 2 వేలకు పైగా ఉద్యోగావకాశాలు రానున్నాయి.
దావోస్ వేదికగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు నూతన విధానాలను తీసుకొచ్చింది. అందులో భాగంగా వచ్చే ఐదేళ్లలో 25 బిలియన్ యూఎస్ డాలర్లు అంటే 2.29 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు సుమారు 5 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా తెలంగాణ లైఫ్ సైన్స్ పాలసీ (2026 30) రూపొందించింది. రాష్ట్రాన్ని ప్రపంచంలోని అగ్రగామి ఐదు లైఫ్ సైన్‌స్ క్లస్టర్లలో ఒకటిగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా 'గ్రీన్ ఫార్మాసిటీ అండ్ ఫ్లాగ్ షిప్ ఫార్మా విలేజెస్' కార్యక్రమాన్ని అమలు చేయనుంది. రూ.వెయ్యి కోట్లతో నిధితో ఈ రంగంలో నూతన ఆవిష్కరణను ప్రోత్సాహించనుంది. 2036 ఒలింపిక్స్‌లో భారత్ పతకాలు సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టాటా గ్రూప్‌తో చర్చలు జరపడంతో గ్రేటర్ హైదరాబాద్ లోని పలు క్రీడా మైదానాల అభివృద్ధిలో భాగాస్వామ్యం కావడానికి వారు ముందుకొచ్చారు.

తెలంగాణలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఉన్న సానుకూలమై అవకాశాలు, అనుకూల వాతావరణం, పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రూపొందించిన విధానాలను దావోస్ సమ్మిట్‌లో పంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రతి ఏటా దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు అనంతరం దానికి అనుగుణంగా గ్రేటర్ హైదరాబాద్ లో జూలై ఆగస్టు నెలల్లో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. దీని ద్వారా దావోస్ ఒప్పందాలను, పురోగతిని సమీక్షించడంతో పాటు ప్రభుత్వం, కంపెనీల మధ్య సమన్వయం పెరిగే అవకాశాలుంటాయి. ఈ ప్రతిపాదన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. మరోవైపు 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యాలు, రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే ప్రణాళికలు దావోస్ లో పెట్టుబడుదారులను ఆకర్షించాయి. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా మూడు జోన్ల నమూనాతో పాటు క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో గ్రేటర్ నగరంలో భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో పలు కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చాయి. ఏరోస్పేస్, డిఫెన్స్, బయో డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా తదితర రంగాలకు గ్రేటర్ హైదరాబాద్ అనుకూలంగా ఉండడంతో పాటు ఇక్కడున్న స్థానికంగా ఉన్న సహజ వనరులు, మానవ వనరులతో కూడా తెలంగాణ పెట్టుబడులకు సానుకూలంగా మారింది. అంతేకాక నగరం చుట్టూ ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ రహదారులు, నగరం నలువైపులా మెట్రో రైలు విస్తరణ వంటి రవాణా సౌకర్యాలు పెంపుకు ప్రభుత్వం పనులు ప్రారంభించింది.

రాష్ట్రాన్ని పెట్టుబడులకు కేరాఫ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఒక్కొక్కటీ సఫలీకృతం అవుతండడంతో తెలంగాణకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. దావోస్ వేదికగా 2024లో రూ.40,832 కోట్లతో 18 పరిశ్రమలు, 2025లో రూ.1,78,950 కోట్లతో 26 పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్న తెలంగాణ ప్రభుత్వం వరుసగా మూడోసారి దావోస్‌లో మరిన్ని పెట్టుబడులను సాధించింది. ఈ విజయాల వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేసిన దీర్ఘకాలిక కృషి ఫలించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ 'ఫ్యూచర్ సిటీ' పేరుతో పెట్టుబడులకు కేంద్రంగా మారుతోంది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాలకు తోడుగా నాలుగో నగరం ఫ్యూచర్ సిటీ నిర్మిస్తుండంతో పెట్టుబడులకు అనుకూలంగా మారింది. ఈ నాలుగో నగరంలో ఐటీ అభివృద్ధితో పాటు ఆపిల్ ఫోన్ విడిభాగాల పరిశ్రమ, ఎలక్ట్రిక్ ఈవీ బస్సుల తయారీ యూనిట్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు ప్రాధాన్యతిస్తున్నారు. ఇక్కడ ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలు, రెస్టారెంట్లు, వినోద కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు రేస్ క్లబ్, గోల్ఫ్ క్లబ్, ట్రేడ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది.

సాఫ్ట్ వేర్ ఐటీ రంగానికి కేరాఫ్ గా మారిన గ్రేటర్ హైదరాబాద్ అదే స్థాయిలో ఫార్మా, వైద్య రంగంలోనూ దూసుకుపోతోంది. రాష్ట్ర ఐటీ రంగంలో 10 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. గ్రేటర్ నగరంలో 1500 కుపైగా ఐటీ కంపెనీలున్నాయి. ఒక్క ఐటీ రంగమే కాకుండా ఫార్మాకు సంబంధించి వ్యాక్సిన్ మొదలుకొని పలు ఔషధ కంపెనీలు నగరంలో ఉన్నాయి. అయితే వీటితో నగరం కాలుష్య బారీన పడకుండా ఫ్యూచర్ సిటీలో పరిశోధనలు చేసే సంస్థలకు, ముడి సరుకు తెచ్చి మందులను తయారు చేసే ఫార్మా కంపెనీలకే భూములను కేటాయిస్తారు. మరోవైపు పలు ప్రముఖ ఆస్పత్రులకు కూడా నగరం కేంద్రం కావడంతో ప్రపంచ వ్యాప్తంగా వైద్య అవసరాల కోసం హైదరాబాద్ వస్తుండడంతో ఐటీతో పాటు వైద్య, ఫార్మా రంగంలో కూడా తెలంగాణకు భారీ పెట్టుబడులు వస్తున్నాయి.

సబ్బండ వర్గాలు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే ఆర్థిక రంగంలో పుంజుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ఆర్థికంగా బలంగా మారితేనే రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి కూడా పెద్ద పీట వేయచ్చని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తుండడంతో భవిష్యత్తులో తెలంగాణకు మరిన్ని ఆకర్షణీయమైన పెట్టుబడులతో పాటు ఉద్యోగావకాశాలు పెరగడం ఖాయం. దావోస్ లో వరుసగా మూడోసారి ధమాకాతో తెలంగాణ రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత లభించడంతో రాష్ట్ర ఆర్థిక రంగం అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి.



**దావోస్ వేదికగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తూ గత రెండు పర్యాయాలు భారీ పెట్టుబడులు సాధించిన తెలంగాణ ఇప్పుడు మరోసారి 2026లో కూడా దావోస్ సమ్మిట్ ను దిగ్విజయంగా వినియోగించుకుంది. గ్రేటర్ హైదరాబాద్ లో ఇటీవల జరిగిన '2025 గ్లోబల్ సమ్మిట్' '2026 దావోస్ సమ్మిట్' తెలంగాణలో పెట్టుబడులకు సోపానంగా మారింది.**

**తెలంగాణలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఉన్న సానుకూలమై అవకాశాలు, అనుకూల వాతావరణం, పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రూపొందించిన విధానాలను దావోస్ సమ్మిట్‌లో పంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రతి ఏటా దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు అనంతరం దానికి అనుగుణంగా గ్రేటర్ హైదరాబాద్ లో జూలై - ఆగస్టు నెలల్లో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. దీని ద్వారా దావోస్ ఒప్పందాలను, పురోగతిని సమీక్షించడంతో పాటు ప్రభుత్వం, కంపెనీల మధ్య సమన్వయం పెరిగే అవకాశాలుంటాయి.**

**సబ్బండ వర్గాలు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే ఆర్థిక రంగంలో పుంజుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ఆర్థికంగా బలంగా మారితేనే రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి కూడా పెద్ద పీఠ వేయచ్చని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి.**



-ఐ.వి.మురళీ కృష్ణ శర్మ.

# మృత్యుకూపాలుగా మారుతున్న ప్రధాన రహదారులు

నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం అతివేగంగా ఆదరాబాదరగా వాహనాలను నడపడం వల్లే తరచుగా రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఈ రోడ్డు ప్రమాదాలలో లక్షల సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం. భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఈ రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ గా 25 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల యువతీ యువకులు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తుంది. భారత దేశవ్యాప్తంగా 64 లక్షల కిలోమీటర్ల పొడవునా రోడ్లు ఉన్నాయి ఈ రహదారుల్లో నిర్వహణ సరిగా లేనివి ప్రమాదకరంగా మృత్యు కూపాలుగా మారుతున్నాయి. ప్రపంచ దేశాలలో కెల్లా మన భారతదేశం రోడ్డు ప్రమాదంలో మొదటి స్థానంలో ఉండటం భయాందోళనకు గురవుతున్నారు. ఒక నిమిషానికి ఐదు మంది, గంటకు 60 మంది ఒక రోజుకు 240 మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోవడం బాదేస్తుంది. భారతదేశంలోని అనేక రోడ్లు ఆక్సిడెంట్లకు నిలయాలుగా మారుతున్నాయి. భారతదేశంలో కెల్లా రోడ్డు ప్రమాదాలలో హైదరాబాద్ నగరం అగ్రస్థానంలో ఉందని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి జాతీయ రహదారులు నేషనల్ హైవే నగర శివారులలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్లు గుంతలు గుంతలు గా ఉండటం స్పీడ్ బ్రేకర్లు ఉండడం అతివేగంగా ప్రయాణించడం నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం హెల్మెట్ ధరించకపోవడం కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్టు ధరించకపోవడం నిద్రమబ్బుతో వాహనాలను నడపడం మద్యం సేవించి వాహనాలు నడపడం ఇవన్నీ ఈ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయి.

2022లో 4.5 లక్షల ప్రమాదాలు జరగగా 17 లక్షల మంది చనిపోయారని అధికారికంగా ప్రకటించారు. 2023లో 4.8 లక్షల ప్రమాదాలు జరగగా 17 లక్షల మరణాలు జరిగాయని తెలిసింది. 2024లో 4.73 లక్షల ప్రమాదాలు జరగగా 20 లక్షల మరణాలు జరిగాయి 2025 జనవరి నుండి జూన్ మధ్యన ప్రమాదాల రూపంలో 29 వేల రెండు వందల మంది చనిపోయారు. ఎక్కువగా జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలలో చనిపోయారని గణంకాలు చెబుతున్నాయి. భారతదేశంలో ప్రతి ఏటా మూడు లక్షల మంది చనిపోతున్నారని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రమాదాలు ఉదయం 6 నుంచి 12 గంటల వరకు 26 శాతం జరుగుతున్నట్లు ప్రమాద కేసులో నమోదవుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 40% ప్రమాదాలు జరుగుతున్నాయని సాయంత్రం 6 గంటల నుండి అర్ధరాత్రి వరకు 25% శాతం ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో భారతదేశం మొదటి స్థానంలో ఉండటం భయాందోళనలు కలిగిస్తున్నాయి మహారాష్ట్ర తమిళనాడు రాజస్థాన్ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కర్ణాటక ఆయా రాష్ట్రాలలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువే. అతివేగం డ్రైవర్లు వేగం తగ్గించకపోవడం ఫాగ్ లైట్లు వాడకపోవడం. వల్ల తరచుగా ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాలలో రోడ్డు ప్రమాద బారినపడిన క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందక దగ్గరలో హాస్పిటల్స్ లేకపోవడం అంబులెన్స్ సౌకర్యం లేకపోవడం, గ్రామీణ ప్రాంతాలలో ఆసుపత్రులు దూరంగా ఉండటం, రోడ్డు ప్రమాద బారిన పడిన బాధితులు చనిపోతున్నారు. 2025 రోడ్డు ప్రమాదం, అగ్ని ప్రమాదాలు



వల్ల తెలంగాణ రాష్ట్రంలో సుమారు 125 మంది చనిపోయారు. వీరు చనిపోవడంతో వీరి కుటుంబాలు రోడ్ల పాలయ్యారు. 2025 పటాన్ చెరువు పాశమైలారం చిగాచి ఇండస్ట్రీలో ఫార్మ యూనిట్లో రియాక్టర్ పేలడం వల్ల 55 మంది కార్మికులు మంటల్లో చనిపోయారు మరో 35 మందిని మంటల్లో గాయపడగా ఆసుపత్రికి తరలించారు. టింబర్ డిపోలలో కూడా ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని కుషాయిగూడలో భార్యాభర్తలు ఇద్దరు చనిపోయారు. తెలుగు రాష్ట్రాలలో గడిచిన రెండు సంవత్సరాలలో 2 లక్షల మంది వాహనదారులు సిగ్నల్ జంపింగ్ చేయగా 1,96,788 మంది సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ పట్టుపడ్డారు మరో 78 లక్షల మంది హెల్మెట్లు ధరించకుండా. వాహనాలను నడుపుతున్నారు. ఏడు లక్షల మంది అతివేగంతో వెళ్తూ పోలీసులకు పట్టుబడినారు. ప్రధాన కూడలిలో రెడ్ సిగ్నల్ పడిన దాన్ని పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయేవారు. సూసైడ్ సిగ్నల్ బాంబర్లతో సమానం. విద్యార్థులకు విద్యార్థి దశ నుండి అన్ని వర్గాల ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 2030 నాటికి రహదారి భద్రత చర్యలను 100కు 100% అమలు చేసి రోడ్డు ప్రమాదాలను నివారిస్తామని నితిన్ గడ్కరీ ప్రకటించారు. రోడ్లు టర్నింగులు ఉండటం ఇంజనీరింగ్ లోపాలు ఉండటం రహదారులు ఇరికిరుకు ఉండటం ఇవన్నీ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.

రోడ్డు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులైన క్షతగాత్రులను రోడ్డు ప్రమాద బాధితులను స్థానిక ఆసుపత్రికి తరలించే వారికి 25 వేల రూపాయలను ప్రోత్సాహకంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గుడ్ సమర్టిన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించి రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్య సేవలను అందించినట్లయితే ప్రాణాలను కాపాడవచ్చు. ఎంతోమంది రోడ్డు ప్రమాద బారిన పడి రోడ్లపైనే దీన అవస్థ లో తమకేమీపట్టనట్లుగా వ్యవహరించడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. స్వచ్ఛంద సంస్థలు పోలీసులు విద్యాసంస్థలు వైద్య సంస్థలు కంకణ బద్ధులై రోడ్డు ప్రమాద బాధితులను ప్రాణం నుంచి రక్షించడానికి నిస్వార్థంగా ముందుకు వచ్చి వారికి ఆపదలో చేయూతనిచ్చే వారి ప్రాణాలను కాపాడిన వారిమవుతాము.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని. నిరంతరం ప్రజల మధ్యలోకి తీసుకెళ్తూ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ పోలీసులు నిమగ్నమై ముందుకు కొనసాగుతున్నారు. అప్రమత్తం తోనే ప్రయాణించి ప్రమాదాలను నివారించుదామని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని, నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని, మద్యం తాగకూడదని. పలు సూచనలు చేస్తూ ప్రజలకు అవగాహనను కల్పిస్తున్నారు. దీనికి ప్రజల నుండి కూడా అపూర్వమైన స్పందన వస్తుంది. అన్ని వర్గాల ప్రజలు కూడా రోడ్డు ప్రమాదాలపై నివారించడంలో అరైవ్ అలైవ్ సదస్సులలో పాల్గొంటూ ప్రజలు కూడా తమ తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. రోడ్డు ప్రమాద బాధితులు తమ అభిప్రాయాలను చెప్పుకుంటూ. కుటుంబాలను కోల్పోయి అవయవాలను కోల్పోయి ఆర్థికంగా చితికిపోయామని కన్నీరు మున్నీరు విలపిస్తున్నారు .వారి మాటలు వింటుంటే కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. జీవితమంటే ఇంతేనా అని అనిపిస్తుంది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా నెమ్మదిగా వెళ్ళు గమ్యాన్ని చేరు అనే పోలీసుల నినాదం ఇది ప్రజలను ఎంతో ఆకట్టుకుంటుంది. పోలీసులు ఒకరు చేస్తే సరిపోదు విద్యార్థులు యువకులు ఉద్యోగులు కాలనీల ప్రజలు గ్రామీణ ప్రజలు అందరూ కలిసి వచ్చి ఒక ఉద్యమం లాగా చేయాలి అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించిన వారిమి అవుతాం. అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ను ను మిగతా రాష్ట్రాలు కూడా స్ఫూర్తిదాయకంగా తీసుకొని రోడ్డు ప్రమాదాల నివారణకై ఒక ఉద్యమం లాగా నిర్వహించాల్సిన అవసరం ఆయా ప్రభుత్వాల పై ఎంతైనా ఉంది. ఈ రోడ్డు ప్రమాదాలపై ఒక పోలీస్ శాఖ మాత్రమే కాదు అన్ని శాఖలు కూడా కదిలి వచ్చి ఒక ప్రణాళిక బద్ధంగా చేసినట్లయితే ప్రమాదాలు నివారించిన వారిమి అవుతాం.

- దామరపల్లి నర్సింహారెడ్డి,
95813 58696

# టైరు పేలి ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా

- త్రుటిలో తప్పిన ప్రమాదం.. విద్యార్థులు క్షేమం
- హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి మృగవాణి వద్ద ప్రమాదం



**మొయినాబాద్ మహా:** ప్రమాదవశాత్తు ఓ ప్రైవేటు బస్సు టైరు పేలి బోల్తా పడిన ఘటన హైదరాబాద్‌బీజాపూర్ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. బస్సులో ఉన్న విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగపోవడంతో అంతా ఊపిరిపిల్చుకున్నారు. చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతం ఘటన స్థలంలో తెలిపిన వివరాల ప్రకారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని బండ్లగూడ జాగీర్ పరిధిలోని హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమం ఈ నెల 31వ తేదిన ఉంది. ఇందుకు సంబందించి విద్యార్థులకు డ్యాన్స్ కాంపిటేషన్ ట్రైనింగ్ నిర్వహించేందుకు మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్నగర్ చౌరస్తాలోని చాందిని ఫంక్షన్హాల్లో విద్యార్థులకు డ్యాన్స్ కాంపిటేషన్ ట్రైనిం గను మూడు రోజుల పాటు నిర్వహిస్తుండగా రెండవ రోజు బుధవారం విద్యార్థులను అక్కడికి తీసుకువెళ్లారు. ట్రైనింగ్ పూర్తి అయిన తరువాత పాఠశాలకు 25 మంది విద్యార్థులను పాఠశాలకు తిరిగి బస్సులో తీసుకువెళ్తుండగా అజీజ్నగర్ సమీపంలోని మృగవాణి జాతీయ పార్కు ముందు బస్సు టైరు పేలిపోయింది. దీంతో బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఒక విద్యార్థికి స్వల్పంగా తలకు గాయమైనట్లు డీసీపీ తెలిపారు. అదృష్టం కొద్ది ఎవరికీ ఏమి కాకపోవడంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే విద్యార్థులను పాఠశాలకు, వారి ఇంటికి తరలించారు. హైదరాబాద్‌బీజాపూర్ జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో నాలుగు కిలో మీటర్ల మెర వాహనాలు నిలిచి పోయాయి. ఘటన స్థలానికి చేవెళ్ల ఆర్డీఓ వెంకట్రెడ్డి, మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్, సీఐ పవనకుమార్ రెడ్డిలు చేరుకొని సమీక్షించారు. పూర్తి వివరాలు సేకరించారు. గాయాలుకానీ విద్యార్థులను అంబులెన్సులో తరలించడంపై పలువురు పాఠశాల యజమాన్యంపై ఆరోపణలు చేస్తున్నారు.

# రేవంత్ సర్కార్‌పై రాజగోపాల్ రెడ్డి 'బాంబు'!

- బిల్లులు చెల్లించకపోతే ఏదో ఒక రోజు బాంబు పేలుస్తా..
- మునుగోడును విస్మరించి కొడంగల్, మధిరలకే నిధులా?
- భట్టిని అడిగితే పైసలు లేవంటున్నారు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫైర్..

**మునుగోడు మహా :** కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల సెగ రాజుకుంది. తన నియోజకవర్గ అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై ధ్వజమెత్తుతూ.. "ఇలాగే కొనసాగితే ఏదో ఒక రోజు బాంబు పేల్చడం ఖాయం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.



**హామీ ఇచ్చి మూడు వారాలైనా..**

మునుగోడు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి పాత బిల్లులు విడుదల చేయాలని గతంలోనే సీఎంతో చర్చించానని రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. "వారం రోజుల్లో బిల్లులు చెల్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కానీ మూడు వారాలు గడుస్తున్నా అతీగతీ లేదని, ప్రభుత్వంపై నమ్మకంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఇప్పుడు నష్టపోతున్నారు. బిల్లులు రాకపోవడంతో చేసేదేమీ లేక పనులు మధ్యలోనే ఆపేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**వివక్షపై ఆగ్రహం..**

రాష్ట్రంలోని నిధుల పంపిణీలో ప్రాంతీయ వివక్ష కనిపిస్తోందని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. నిధులన్నీ కేవలం కొడంగల్ (సీఎం నియోజకవర్గం), మధిర (డిప్యూటీ సీఎం నియోజకవర్గం), హుజూర్ నగర్ (ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం)లకు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. "ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను నిలదీస్తే.. ప్రస్తుతానికి బిల్లులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని నిర్మొహమాటంగా సమాధానం చెబుతున్నారు" అని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.మునుగోడు నియోజకవర్గఅభివృద్ధి నిధుల కోసం, పెండింగ్ బిల్లుల కోసం నిరంతరం ఎదురుచూసి విసిగిపోయానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. "ప్రభుత్వంలో ఉండి కూడా నా నియోజకవర్గానికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోను.




## బీఆర్ఎస్ గెలిచేందుకు కృషి చేయాలి

**మొయినాబాద్ మహా:** జరగనున్న, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగెలిచేందుకు సమిష్టిగా కృషి చేయాలని మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మ తా జయసింహ్మ సూచించారు. బుధవారం ఆయన మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల పరిస్థితిపై నాయకులతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 26 వార్డులలో బీఆర్ఎస్ ప్లాట అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు అం దరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి అనం తరెడ్డి, జిల్లా నాయకులు కొత్త నర్సింహ్మరెడ్డి, శ్రీహరియాదవ్, జయవంత్, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి, కొత్త మాణిక్ రెడ్డి, డెవిడ్, తదితరులు ఉన్నారు.

# షాద్ నగర్ లో మొదటిరోజు ఆరు నామినేషన్లు దాఖలు

**పేర్లు వివరాలు గోప్యంగా ఉంచిన ఎన్నికల అధికారులు**



**షాద్ నగర్. మహా,** షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా బుధవారం మొదటి రోజు 6 నామినేషన్లు దాఖలేనట్టు అసిస్టెంట్ డిస్టిక్ ఎలక్షన్ అథారిటీ ఆఫీసర్ సునీత రెడ్డి మీడియాతో తెలిపారు. పట్టణంలోని ఐదవ వార్డు, ఏడవ వార్డు, ఎనిమిదవ వార్డు, 16వ వార్డు, 28 వార్డులకు మొత్తం 5 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు ఇందులో ఒకరు రెండు నామినేషన్ సెట్లను వేశారు.

**పేర్లు వివరాలు గోప్యం..**

షాద్ నగర్ మున్సిపాలిటీలో పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను ఫోటోలను ఎలక్షన్ అధికారులు గోప్యంగా ఉంచారు. పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేసిన వారి వివరాలను మీడియాకు వెల్లడించలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పేర్లు ఫోటోలు మీడియాకు ఇవ్వలేదని అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీ ఆఫీసర్ సునీత రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా సోషల్ మీడియాలో ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్ తల్లి ఆలుగడ్డ పుష్పమ్మ తదితరులు నామినేషన్ వేసిన ఫోటోలు దర్శనమిచ్చాయి. మరి ఎన్నికల అధికారులు ఈ ఫోటోలను బయటికి ఎలా ఇచ్చారు నామినేషన్ పత్రాలు తీసుకుంటూ ఫోటోలు ఎలా పెట్టారో అధికారులకే తెలియాలి.

# నామినేషన్ల కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత..

**కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్..**




**నల్లగొండ మహా :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నగారా మోగడంతో నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. బుధవారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ స్వయంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థుల రాకపోకలు, క్యూలైన్ల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు.నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో అభ్యర్థులు పత్రాలు దాఖలు చేసే విధానం, ఎంట్రీ మరియు ఎగ్జిట్ పాయింట్లు, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అభ్యర్థులకు, వారి వెంట వచ్చే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రక్రియ మొత్తం పారదర్శకంగా సాగాలని ఆదేశించారు.

**100 మీటర్ల పరిధిలో 'నో ఎంట్రీ'...**

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల మేర నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. "ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ తూచా తప్పక పాటించాలి. అనుమతి లేకుండా గుంపులుగా చేరడం, నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

**సీసీ కెమెరాల నిఘా.. గట్టి బందోబస్తు..**

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు నామినేషన్ కేంద్రాల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.నామినేషన్ కేంద్రం లోపల, బయట సీసీటీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ, ప్రత్యేక గస్తీ బృందాలతో పాటు బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లను అప్రమత్తం చేశారు.అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.మున్సిపల్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాం రెడ్డి, ఎస్‌బీ సీఐ రాము, టూటౌన్ ఎస్ఐ సైదులు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ పోరుకు గులాబీ సేన సిద్ధం!




**నల్లగొండ మహా ప్రతినిధి:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమరానికి బీఆర్ఎస్ శంఖారావం పూరించింది. బుధవారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటిస్తూ కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. నల్లగొండను దశాబ్దాల పాటు నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదని మండిపడ్డారు.విలేఖరుల సమావేశం లో భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. "తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకోవడం వల్లే నేడు నగరం సుందరంగా మారింది. రూ.1300 కోట్లతో ఐటీ హబ్, మెడికల్ కాలేజ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ట్రాఫిక్ జంక్షన్లను నిర్మించాం. కేటీఆర్ ప్రత్యేక చొరవతో తెచ్చిన నిధులే నల్లగొండకు కార్పొరేషన్ హోదా కల్పించాయి" అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే తమ అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

**మంత్రి కోమటిరెడ్డి పై ఘాటు విమర్శలు..**

ప్రస్తుత ఆర్అండ్‌బీ మంత్రి తీరుపై కంచర్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సామాన్యుల కోసం ఉన్న ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను మంత్రి తన సొంత క్యాంపు కార్యాలయంగా మార్చుకున్నారని ఆరోపించారు. ఫ్లై ఓవర్, ఔటర్ రింగ్ రోడ్డు కాంట్రాక్టర్లను బెదిరించి వసూలు చేసిన సొమ్ముతో స్కూళ్లు కట్టి, తమ పేర్లు పెట్టుకుంటున్నారని, కాలాభారతికి రూ.90 కోట్లు, ఎన్‌జీ కాలేజీకి రూ.36 కోట్లు మంజూరు చేయించినా నేటి ప్రభుత్వం పనులు ముందుకు తీసుకెళ్లడం లేదని, పానగల్ లోని ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు.

**బరిలో నిలిచే అభ్యర్థుల (తొలి జాబితా)..**
**బీఆర్ఎస్ ప్రకటించిన 18 మంది అభ్యర్థుల వివరాలు**

3 వ డివిజన్ పేర్ల మల్లేశ్వరి అశోక్ ఎస్సీ (మహిళ)
7 వ డివిజన్ మారగోని భవాని గణేష్ జనరల్ (మహిళ)
9వ డివిజన్ బాణావతి దీప్లా నాయక్ ఎస్టీ (జనరల్)
11వ డివిజన్ దండంపల్లి సుజాత సత్తయ్య జనరల్ (మహిళ)
13వ డివిజన్ గన్రెడ్డి రాధిక యుగంధర్ రెడ్డి (జనరల్)
15 వ డివిజన్ దొడ్డి రమేష్ ఎస్సీ (జనరల్)
20 వ డివిజన్ సిపిఎం (పొత్తులో భాగంగా) సలీం
21 వ డివిజన్ అఫజల్ ఖాన్ (జనరల్ )
25 వ డివిజన్ మాతంగి ఉమాదేవి జనరల్ (మహిళ)
38 వ డివిజన్ అల్లి గౌతమి శివ శంకర్ బీసీ (మహిళ)
39 వ డివిజన్ అల్లి వేణు యాదవ్ బీసీ (జనరల్)
47 వ డివిజన్ సింగం లక్ష్మి రామ్మోహన్ బీసీ (మహిళ)

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు భువనగిరి దేవేందర్ మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నల్గొండ 'కార్పొరేషన్' పోరుకు కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు

**మేయర్ అభ్యర్థిగా బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పేరును అధికారికంగా ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి..**

**నల్గొండ మహా:** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ పార్టీ సమరశంఖం పూరించింది. పట్టణ అభివృద్ధిని కాంక్షిస్తూ, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని తొలి విడతగా 45 వార్డులకు అభ్యర్థుల జాబితాను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బుధవారం అధికారికంగా విడుదల చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన నల్గొండ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పేరును ఖరారు చేశారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డిల ఆమోదంతో ఈ జాబితాను రూపొందించినట్లు మంత్రి పేర్కొన్నారు. "నల్గొండ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చుకోవడం ఇక్కడి ప్రజల చిరకాల స్వప్నం. సుమారు 2200 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. నల్గొండను రాష్ట్రంలోనే నంబర్ వన్ 'సూపర్ స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**వార్డుల వారీగా అభ్యర్థుల జాబితా**

|1|అలకుంట్ల నాగరాజు (చిట్టి)|బి.సి. జనరల్|
|3|గాలి వినోద (నాగరాజు)|ఎస్.సి. మహిళ|
|4|బోగరి సింధు (ఆనంద్)|ఎస్.సి. మహిళ|
|5|పున్న జ్ఞానేశ్వరి (గణేష్)|జనరల్ మహిళ|
|6|కర్నాటి సునంద కరుణాకర్ రెడ్డి|జనరల్ మహిళ
|9|అంగోతు ప్రదీప్ నాయక్|ఎస్.టి. జనరల్|
|10|చిన్నాల జానయ్య|జనరల్|
|12|మామిడి కార్తీక్|ఎస్.సి. జనరల్|
|16|పెరిక స్వాతి (వినాయకరాజు చిట్టి)|ఎస్.సి. మహిళ
|21|ఎం.డి. ఇబ్రహీం|జనరల్|
|32|బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి|జనరల్ మహిళ|
|34|ఎదుళ్ల శ్రీధర్ రెడ్డి|జనరల్|
|41|కేసాని వేణుగోపాల్ రెడ్డి|జనరల్|
|44|ఎం.డి. ఇర్ఫాన్ అహ్మద్|బి.సి. జనరల్|
|48|యామా కవిత దయాకర్|జనరల్ మహిళ|

## నిఘా నేత్రాల నిఘాలో జాతర మార్గం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ హన్మకొండ మహా;** మేడారం మహా జాతర నేపథ్యంలో భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యంగా పోలీస్ శాఖ అత్యాధునిక నిఘా నేత్రాలను (సీసీ కెమెరాలు) ఏర్పాటు చేసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి నుంచి గద్దెల వరకు ప్రతి వాహన కదలికలను కెమెరాల్లో బంధించనున్నారు. ఇందుకోసం ట్రై సిటీ పరిధిలో 715, మేడారం మార్గంలో 530 సీసీ కెమెరాలను అమర్చి, కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా క్షణాల్లో గుర్తించేలా వ్యవస్థను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మేడారం జాతరకు వెళ్లే మార్గాలను ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

## మేడారంలో ఫస్ట్ రెస్పాండర్ 108 బైక్ అంబులెన్స్ లు

**భక్తుల ఆరోగ్య భద్రతకు 40 మొబైల్ అంబులెన్స్ ల ఏర్పాటు**

**వరంగల్ మహా;** మేడారం శ్రీ సమ్మక్క, సారలమ్మ మేడారం మహాజాతర సందర్భంగా భక్తులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఫస్ట్ రెస్పాండర్ 108 బైక్ అంబులెన్స్ సేవలను విస్తృతంగా ఏర్పాటు చేసింది. మేడారం జాతర ప్రాంతమంతటా మొత్తం 40 ఫస్ట్ రెస్పాండర్ 108 బైక్ అంబులెన్స్‌లను వివిధ కీలక ప్రాంతాల్లో మోహరించారు. భారీ రద్దీ ఉన్న ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకుని వైద్య సహాయం అందించేందుకు వీలుగా ఈ బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ మొబైల్ 108 సేవల ద్వారా జ్వరం, తలనొప్పి, వాంతులు, అలసట వంటి స్వల్ప ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న భక్తులకు తక్షణ ఫస్ట్ ఎయిడ్‌తో పాటు అవసరమైన ప్రాథమిక మందులు అందిస్తున్నారు.అలాగే, పరిస్థితి విషమంగా ఉన్న సందర్భాల్లో భక్తులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు కూడా చేసినట్లు తెలిపారు. జాతర కాలమంతా ఈ సేవలు నిరంతరంగా అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు.భక్తుల భద్రత, ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పగడ్బందీ చర్యలు చేపట్టింది.

# అగ్రవర్ణ పార్టీలను సాగనంపుదాం..

- బీసీ రాజ్యాధికారమే లక్ష్యం..
- నల్గొండ కార్పొరేషన్‌లో 48 వార్డుల్లో పోటీ..
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్..



**నల్గొండ మహా :** మెజార్టీ వర్గాల ఆకాంక్షల మేరకు ఏర్పడిన తెలంగాణ రాజ్యాధికార పార్టీతోనే అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ పేర్కొన్నారు. బుధవారం నల్గొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు వార్డులకు చెందిన యువకులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన రాజకీయ సమీకరణాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**ప్రధాన పార్టీలది మోసపూరిత వైఖరి..**

78 ఏళ్ల స్వతంత్ర భారతంలో కొద్దిమంది వ్యక్తులే రాజ్యాధికారాన్ని అనుభవిస్తూ బహుజన వర్గాలను అణచివేశారని జానయ్య యాదవ్ విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన 'గడిల పాలన'గా సాగిందని, కాంగ్రెస్ పార్టీ 'బీసీ డిక్లరేషన్' పేరుతో బలహీన వర్గాలను నిలువునా వంచించిందని ధ్వజమెత్తారు. "బాత్రూమ్ నిర్మాణానికి రూ. 70 లక్షలు ఖర్చు చేసే పాలకులు, పేదల విద్య, వైద్యం గురించి పట్టించుకోవడం లేదు. అగ్రవర్ణాల చేతుల్లో బందీ అయిన విద్యా, వైద్య వ్యవస్థల వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**'కత్తెర' గుర్తుకే మా మద్దతు..**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిర్ణయాత్మక పాత్ర పోషించబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.నల్గొండ కార్పొరేషన్లోని మొత్తం 48 వార్డుల్లో పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని,ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 మున్సిపాలిటీల్లో 'కత్తెర' గుర్తుపై పోటీ చేస్తున్న అభ్యర్థులను ఆదరించాలని కోరారు. 2028 శాసనసభ ఎన్నికల్లో బీసీ నేతను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.అగ్రవర్ణ పార్టీల వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున యువత రాజ్యాధికార పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని జానయ్య యాదవ్ తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నేతృత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా ఏకమై తమ ఓటు హక్కుతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్లగొండలో మొదలైన 'మున్సిపల్' పోరు..




**నల్లగొండ మహా:** నల్లగొండలో మున్సిపల్ సమరానికి నగారా మోగింది. కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. బుధవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, తొలిరోజే వివిధ డివిజన్ల నుంచి అభ్యర్థులు ఉత్సాహంగా తరలివచ్చారు. మొత్తం 11 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. ఇందులో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీల మధ్య గట్టి పోటీ కనిపిస్తోంది.

**హోరాహోరీగా 18వ డివిజన్..**

నల్లగొండ కార్పొరేషన్‌లోని "18వ డివిజన్ హాట్ సీట్"గా మారేలా కనిపిస్తోంది. ఇక్కడ తొలిరోజే ఏకంగా ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి ఇద్దరు అభ్యర్థులు (బిఫామ్ ఉత్కంఠ నేపథ్యంలో) నామినేషన్లు వేయగా, ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. కార్పొరేషన్ మొత్తం మీద చూస్తే కాంగ్రెస్ పార్టీ నుంచి 6, బీజేపీ నుంచి 4, ఒక స్వతంత్ర అభ్యర్థి తొలిరోజు రేసులో నిలిచారు.

**డివిజన్ల వారీగా బరిలో నిలిచిన అభ్యర్థులవివరాలు**


8 వ డివిజన్ నుంచి పిల్లి సత్యవతి (బీజేపీ)
10 వ డివిజన్ నుంచి పిల్లి కృష్ణం రాజు (బీజేపీ)
18 వ డివిజన్ నుంచి అలకుంట్ల ఝాన్సీ రాణి (కాంగ్రెస్), గడిగా హిమబిందు (కాంగ్రెస్) 18 చిగుర్ల లలిత (స్వతంత్ర) అభ్యర్థులు గా నామినేషన్ లు వేశారు.30 వ డివిజన్ నుంచి మారగోని నవీన్ కుమార్ (కాంగ్రెస్),35 వ డివిజన్ నుంచి నాగమణి మిర్యాల (బీజేపీ),38 బోయినపల్లి వేదశ్రీ (కాంగ్రెస్),40 బొడ్డుపల్లి లక్ష్మి (కాంగ్రెస్),41 కేసాని వేణుగోపాల్ రెడ్డి (కాంగ్రెస్)47 పబ్బు మౌనిక (బీజేపీ), తొలిరోజు వివిధ పార్టీల అభ్యర్థులు జోరు మీద ఉన్నట్లు నామినేషన్ దాఖలు చేసిన విధానాన్ని బట్టి తెలుస్తుంది.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గా 06 గురు, బీజేపీ పార్టీ నుంచి నలుగురు,స్వతంత్ర అభ్యర్థిగా ఒక్కరు, మొత్తం 11 మంది అభ్యర్థులు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు.మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లా కేంద్రంలో రాజకీయ కోలాహలం నెలకొంది. రాబోయే రెండు రోజుల్లో భారీగా నామినేషన్లు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రధాన పార్టీల అగ్రనేతలు తమ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయారు. గెలుపే లక్ష్యంగా సాగుతున్న ఈ పోరులో ఓటరు నాడి ఎటువైపు ఉంటుందో చూడాలి!

# మేడారం జాతర ట్రాఫిక్ పై వరంగల్ సీపీ నజర్




**హన్మకొండ మహా;** 28వ తేదీ నుండి ప్రారంభమైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా వరంగల్ నగరం నుండి మేడారం గద్దల వరకు కొనసాగే రోడ్డు మార్గంలో, వాహనాల రాకపోకలపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పస్రా, తాడ్వాయి, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ కొనసాగుతున్న తీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయడంతో పాటు, ఆయా సెక్టార్ అధికారులకు సీపీ పలు సూచనలు చేస్తున్నారు. ట్రాఫిక్ కు ఎక్కడ కూడా అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# ఉదయ్‌పూర్‌లో పోతరాజు అశోక్‌కు కాంస్య పతకం




**మహా పరకాల:** ఉదయ్‌పూర్‌లో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా ఫైర్ సర్వీస్ కంట్రోల్ బోర్డు మీట్-2026లో 5 కిలోమీటర్ల పరుగుపందెం విభాగంలో హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన పోతరాజు అశోక్ కాంస్య పతకం సాధించారు పోతరాజు అశోక్ మట్టేవాడ ఫైర్ స్టేషన్ల లో కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తూ జాతీయస్థాయి రన్నింగ్ పోటీలో మూడవ స్థానంలో నిలిచారు దేశవ్యాప్తంగా పాల్గొన్న ప్రతిభావంతుల మధ్య అశోక్ ఈ విజయాన్ని సొంతం చేసుకోవడం గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు. అశోక్ సాధించిన ఈ ఘనత పట్ల నాగారం గ్రామ ప్రజలు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన సాధనతో ఈ స్థాయికి చేరుకున్న అశోక్ విజయం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.




## మొయినాబాద్‌లో మొదటిరోజు ఆరు నామినేషన్లు

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికలకు సంబందించి నామినేషన్ల పర్వం మొదటి రోజు బుధవారం ప్రారంభమైంది. మండల కేంద్రం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో మొదటిరోజు బుధవారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. 5వ వార్డుకు 2, 13వ వార్డుకు 2, 17వ వార్డుకు 1, 25వ వార్డుకు 1 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## భాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండలం చరికొండ గ్రామ పంచాయతికి చెందిన వల్లభుదాస్ వెంకటయ్య యాక్సిడెంట్ లో ప్రమాదవశాత్తు రాఘాయిపల్లి గేట్ చనిపోయాడు.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ మహేందర్ గౌడ్ వార్డు సభ్యులు గ్రామస్తులు ఉన్నారు.




## మున్సిపల్ ఎన్నికలకు సహకరించండి

- అఖిలపక్ష సమావేశంలో కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపు..
- జిల్లాలో 6 మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్‌కు ఎన్నికలు..
- ఫిబ్రవరి 11న పోలింగ్.. 13న ఓట్ల లెక్కింపు..
- నామినేషన్ల స్వీకరణ పర్వం షురూ..

**నల్గొండ మహా:** జిల్లా లో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది ఎన్నికలను ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని 6 మున్సిపాలిటీలు (మిర్యాలగూడ, దేవరకొండ, నందికొండ, హాలియా, చిట్యాల, చండూరు) సహా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.మంగళవారం ఎన్నికల షెడ్యూల్ ని ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయం తెలిసిందే, బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం మొదలయింది, నామినేషన్ల పరిశీలన జనవరి 31, ఉపసంహరణ ఫిబ్రవరి 3న ఉంటుందని,పోలింగ్ ఫిబ్రవరి 11 (ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు),ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13 ఉదయం ఎనిమిది గంటలకు మొదలవుతుందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బి చంద్రశేఖర్ తెలిపారు.

**పోలీస్ నిఘా తీవరం..ఎస్పీ శరత్చంద్ర పవార్**

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ.. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ర్యాలీలు, సమావేశాలకు రూట్ మ్యాప్‌ను ముందే సమర్పించాలని, శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

## సొంత గూటికి చేరిన నాయకులు..



**మహా పరకాల:** పరకాల పట్టణం ఒకట వ వార్డుకు చెందిన సీనియర్ నాయకులు బండారి సుగుణాకర్, ఐదవ వార్డుకు చెందిన యాట ప్రశాంత్ లు బుధవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలపై నమ్మకంతోనే తాము తిరిగి సొంత గూటికి చేరుతున్నామని చేరిన నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడారంలో మొరాయిస్తున్న మొబైల్ నెట్వర్క్ లు



**వరంగల్ మహా;** మేడారంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు తరలివచ్చిన లక్షలాది భక్తులకు ఆయా మొబైల్ నెట్వర్క్ లు పెద్ద తలనొప్పిగా మారాయి. మేడారం పరిసరాల్లో సెల్ సిగ్నల్స్ పూర్తిగా అస్తవ్యస్తంగా మారడంతో ఫోన్ కాల్స్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా జియో సిగ్నల్ తక్కువ కావడం భక్తుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తుంది. మేడారం జాతర ప్రాంతంలో జియో వినియోగదారులకు కాల్స్, డేటా పూర్తిగా అందుబాటులో లేవని తెలుస్తోంది. అత్యధికంగా ఉపయోగించే నెట్వర్క్ పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులను సంప్రదించలేక భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో ఎయిర్టెల్ సిగ్నల్స్ ఫోన్లలో కనిపిస్తున్నప్పటికీ, కాల్స్ కనెక్ట్ కాకపోవడం, డయల్ చేసిన వెంటనే డ్రాప్ కావడం, వాయిస్ స్పష్టత లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. అత్యవసర సందర్భాల్లో సమాచారం చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**బీఎస్ఎన్ఎల్ తో కాస్త ఊరట**

ఇతర నెట్వర్క్ తో పోలిస్తే బీఎస్ఎన్ఎల్ సేవలు కొంత మేరకు ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. కాల్స్ నెమ్మదిగా కనెక్ట్ అవుతుండగా, ఇంటర్నెట్ పరిమిత వేగంతో పనిచేస్తోంది. దీంతో మీడియా ప్రతినిధులు వార్తలు పంపించుకోవడానికి, భక్తులు అవసరమైన సమాచారాన్ని అందించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న బీఎస్ఎన్ఎల్ తో కొంత ఉపశమనం కలుగుతోంది. మేడారం జాతర సందర్భంగా ఒకేసారి లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో మొబైల్ టవర్లపై తీవ్ర ఒత్తిడి పడినట్లు తెలుస్తోంది. తాత్కాలిక టవర్లు, అదనపు నెట్వర్క్ బూస్టర్లు సరిపడా ఏర్పాటు చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమని అదనపు నెట్వర్క్ బూస్టర్లు సరిపడా ఏర్పాటు చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముందస్తు ప్రణాళికల లోపమే నేటి నెట్వర్క్ ల సంక్షోభానికి దారి తీసిందన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

**డిజిటల్ చెల్లింపుల పై తీవ్ర ప్రభావం**

నెట్వర్క్ సమస్యల కారణంగా యూపీఐ, ఆన్లైన్ చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రసాదాల కొనుగోలు, పార్కింగ్ ఫీజులు, తాత్కాలిక దుకాణాల్లో లావాదేవీలు నగదు రూపంలోనే సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో నగదు అందుబాటులో లేని భక్తులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.మొబైల్ సేవలు సరిగా లేకపోవడం భద్రతాపరంగా కూడా ఆందోళన కలిగిస్తోంది. తప్పిపోయిన భక్తులు కుటుంబ సభ్యులను సంప్రదించలేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమాచారం, అధికారిక సూచనలు వేగంగా చేరకపోవడం వల్ల ప్రమాదకర పరిస్థితులకు దారి తీసే అవకాశముందని పలువురు ఆందోళన చెందుతున్నారు. మేడారం మహాజాతర ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని టెలికాం సంస్థలు తక్షణమే స్పందించి తాత్కాలిక మొబైల్ టవర్లు, అదనపు నెట్వర్క్ ఏర్పాట్లు చేయాలని భక్తులు, మీడియా ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సమాచార విభాగం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2026 క్యాలెండర్, గోడపత్రిక విడుదల...



**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్ అసోసియేషన్ 2026 సంవత్సరపు క్యాలెండర్ ,గోడ పత్రిక లను వారి సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాడు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్,చిన్నపిల్లల విభాగ్యపతి డాక్టర్ నరహరి, నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జానకి దేవి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆనంద్, కమిటీ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ రోగికి వైద్యుని తర్వాత అత్యంత సేవలందిస్తున్నది నర్సింగ్ అధికారులే అని,ఈ జిల్లాలో ఆసుపత్రులలో రోగులకు మెరుగైన సేవలు,చికిత్సలు అందించుటకు నర్సింగ్ అధికారులతోడ్పాటు ఎంతైనా అవసరమని అన్నారు.2026 సంవత్సరంలో నర్సింగ్ అధికారులు ఐక్యతతో ఉంటూ మరిన్ని ఆరోగ్య సేవలు ఈ ప్రాంతంలో,జిల్లాలోని రోగులకు మెరుగ్గా అందించాలని ప్రత్యేకంగా సూచించారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపర్డెంట్ పెర్సీ సుమన్, హెడ్ నర్సులు నిర్మల,అమూర్త, నర్సింగ్ అధికారుల అసోసియేషన్ సభ్యులు యాదగిరి,మన్మోహన్ రెడ్డి, మరియమ్మ,రాజశేఖర్ కి కేశవ్, అంజి ,కిరణ్,రాజు, మహేష్ , జ్ఞానేశ్వరి,రేసిడెంట్ మెడికల్ ఆఫీసర్ లు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ దశరథం,మినిస్ట్రీయల్ సిబ్బంది రామచంద్రయ్య,రవి, కమిటీ సభ్యులు రూప,సువేద, కవిత,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరలో ఆయుష్ వైద్య సేవలు

### 6 వేల మందికి పైగా భక్తులకు ఉచిత చికిత్స.. దుష్ప్రభావాలు లేని సంప్రదాయ వైద్యం పై పెరుగుతున్న విశ్వాసం



**వరంగల్ మహా ;** శ్రీ సమ్మక్క,సారలమ్మ మేడారం మహాజాతర సందర్భంగా భక్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆయుష్ వారు వైద్య శిబిరం ద్వారా ఇప్పటికే 6 వేల మందికి పైగా భక్తులు ఉచితంగా చికిత్స పొందారు. జనవరి 6వ తేదీ నుంచి ఆయుష్ వైద్య సేవలు ప్రారంభం కాగా, సంప్రదాయ వైద్య విధానాలపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో రోజు రోజుకూ శిబిరాన్ని ఆశ్రయించే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మేడారానికి వచ్చే భక్తుల్లో ముఖ్యంగా కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారు ఎక్కువగా ఆయుష్ శిబిరానికి వస్తున్నారని వైద్యులు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 6 వేల మందికి పైగా భక్తులు ఆయుష్ వైద్య సేవలు పొందగా, ఒక్క రోజే 828 మంది భక్తులు చికిత్స పొందారు.వారిలో ఆయుర్వేదం: 286 మంది, యునానీ: 223 మంది ,హోమియోపతి: 329 మంది, ఆయుష్ మందుల పై ప్రజలకు విశ్వాసం పెరిగిందని తెలుస్తోంది. ఎటువంటి దుష్ప్రభావాలు లేని సంప్రదాయ వైద్య విధానాలపై భక్తుల్లో విశ్వాసం పెరుగుతున్నదని ఆయుష్ వైద్యులు తెలిపారు. గతంలో కంటే ఈ సారి ఆయుష్ వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో శిబిరానికి వచ్చే వారి సంఖ్య రోజు రోజుకూ అధికమవుతోందని పేర్కొన్నారు.పూర్తి స్థాయి వైద్య సిబ్బంది, మందుల అందుబాటులో ఉన్నాయి. మేడారం జాతర అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆయుష్ వైద్య శిబిరంలో 25 నుంచి 30 మంది సిబ్బంది, 3 ముగ్గురు ఆయుష్ వైద్యుల తో పాటు ఫార్మాసిస్టులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు.భక్తులకు అవసరమైన అన్ని రకాల ఆయుష్ మందులను ముందుగానే సమకూర్చి, ఎలాంటి కొరత లేకుండా చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మేడారం మహాజాతరకు తరలివచ్చే భక్తులకు సంప్రదాయ వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆయుష్ వైద్య శిబిరం ద్వారా భక్తులకు సురక్షితమైన, ప్రభావవంతమైన చికిత్స అందుతోందని అధికారులు వెల్లడించారు. ఆయుష్ వైద్య సేవల పట్ల భక్తులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

## నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

### నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా లోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయాల్లో మున్సిపల్ వార్డు ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఫ్రీ స్క్రూటినీ, హెల్ప్ డెస్క్ ను సందర్శించి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఏమైనా అనుమానాలు ఉంటే హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేయాలని సూచించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్డుల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో ఆర్ వో లతో మాట్లాడి నామినేషన్లు తీసుకునేందుకు ఏమేమి ఏర్పాట్లు చేశారని, అవసరమైన అన్ని పత్రాలు, వార్డు రిజిస్టర్ లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చేఅభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను సూచించారు. నామినేషన్ల స్క్రూటినీ సమయంలో ఎక్కువ మంది అభ్యర్థులు వస్తే ఎలా చేస్తారనీ ప్రశ్నించగా ఒక్కొక్కరిని పిలుస్తామని మిగతా వారు వేచి ఉండేందుకు బయట షామియానాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఆయా మున్సిపాలిటీల్లో నేటి (బుధవారం) నుంచి నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని రకాల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, నామినేషన్ల ఉప సంహరణ తర్వాత వచ్చే నెల 11న పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా బిసి సంక్షేమ అధికారి పుష్పలత, ఆర్డీఓలు సుమా, ఉమారాణి, మునిసిపల్ కమిషనర్లు, సుధీర్ కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

## చారిత్రక ఆలయాల అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా ;** వరంగల్ లో ప్రాచీన ప్రసిద్ధిగాంచిన ఆలయాలు చాలానే ఉన్నాయి. ఇలాంటి చారిత్రక దేవాలయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్ కోటలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పురావస్తు మ్యూజియం అభివృద్ధి పనులపై బుధవారం హనుమకొండలోని కుడా కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు, ఇతర అధికారులతో కలిసి మ్యూజియం అభివృద్ధి, వారసత్వ సంపద పరిరక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) వైస్ చైర్పర్సన్ చాహత్ బాజ్‌పాయ్, సీపీవో అజిత్ రెడ్డి, పురావస్తు శాఖ అధికారులు, (టీమ్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్) కార్యదర్శి అరవింద్ ఆర్య, తదితరులు పాల్గొని, వరంగల్‌ను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వరంగల్ పురావస్తు మ్యూజియంను వరంగల్ కోటలో నూతనంగా నిర్మించిన భవనానికి తరలించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. వరంగల్ కోటతో పాటు పరిసర వారసత్వ ప్రాంతాల్లో చేపట్టవలసిన మరమ్మత్తులు, అభివృద్ధి పనుల అంచనాల కోసం కుడా ఇంజనీరింగ్ విభాగం, హెరిటేజ్ శాఖలు సంయుక్తంగా త్వరలోనే స్థల పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు.వరంగల్ కోటలోని మ్యూజియం అభివృద్ధిలో భాగంగా కాంపౌండ్ వాల్ నిర్మాణం, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్ సదుపాయాల కల్పన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.అలాగే మొగిలిచర్లలోని ఏకవీర దేవాలయ పునరుద్ధరణ, శాయంపేటలోని పాంచాలరాయ ఆలయ అభివృద్ధి, వరంగల్ కోటలోని శంభుని గుడి పునరుద్ధరణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.వరంగల్ నగరానికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధికి దోహదపడే విధంగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సుమ, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ మరియు ఇంచార్జ్ టూరిజం ఆఫీసర్ అనిల్ కుమార్, తహసిల్దార్ శ్రీకాంత్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

### ఎమ్మెల్యే నాగరాజు, డిసిసి అధ్యక్షుడు అయూబ్



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అత్యధిక స్థానాలు సాధించి మున్సిపాలిటీని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పని చేయాలని వరంగల్ డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తో వరంగల్ డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త ఈగ దామోదర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత పదేళ్లలో పాలకులు చేయని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ రథసారథి మహేష్ కుమార్ గౌడ్ ల ప్రజా పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు.


## మేడారం జంపన్న వాగులో ఒకరి మృతి



**వరంగల్ మహా;** మేడారం జంపన్నవాగులో స్నానం కోసం దిగిన ఓ భక్తుడు నీటి ప్రవాహంలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన జాతరలో పాల్గొన్న భక్తుల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. మంచిర్యాల జిల్లాకు చెందిన కిరణ్ (45) అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అమ్మవార్ల దర్శనానికి మేడారం వచ్చాడు. జంపన్నవాగులో పుణ్యస్నానం ఆచరించేందుకు వాగులోకి దిగిన సమయంలో నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు.కళ్లముందే జరిగిన ఘటనతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల భక్తులు ఒక్కసారిగా షాక్కు గురయ్యారు.

## పరకాలలో తొలిరోజు ఐదు నామినేషన్లు

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా పరకాల పురపాలక సంఘంలో 22 వార్డులకు నామినేషన్ల పర్వం బుధవారం ప్రారంభమైంది. 22 వార్డులకు గాను అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరించేందుకు ఏడు కౌంటర్లను ఏర్పాటు చేయగా రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించారు. తొలి రోజు బుధవారం 7,11,16,18,20 వార్డులకు ఒక్కో నామినేషన్ చొప్పున ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, పురపాలక కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ విజయలక్ష్మి పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు




## మ్యూజికల్ ఫౌంటెన్ ఏర్పాటుకు చర్యలు

### నగర మేయర్ గుండు సుధారాణి .. కమిషనర్ తో కలిసి మేయర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షణ



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగర పరిధి లో మ్యూజికల్ ఫౌంటెన్ ఏర్పాటు కు అనువైన ప్రాంతాన్ని (స్థలాన్ని) గుర్తించాలని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు.బుధ వారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో అనంతరం మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి మేయర్ పాల్గొని సమర్ధవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో మ్యూజికల్ ఫౌంటెన్ ఏర్పాటుపై డిల్లీ కి చెందిన రిపుల్ ఏజెన్సీ ప్రతినిధులతో చర్చించడం జరుగుతుందని, ఇందులో భాగంగా వారికి కేటాయించిన పనులు గురించి చర్చించారు.ఫౌంటెన్ ఏర్పాటుకు అవసరమైన నిరంతర విద్యుత్ సరఫరా నీటి సరఫరా నీరు వెళ్ళిపోవడానికి అనువైన డ్రైనేజీ వ్యవస్థ తో పాటు బండ్ పై ఎంత దూరం లో ఏర్పాటు చేస్తే అనుకూలం గా ఉంటుంది వంటి అంశాల పై సమీక్షించారు. బల్దియా పరిధిలో భద్రకాళి బండ్ తో పాటు వడ్డేపల్లి బండ్ పై ఏజెన్సీ ప్రతినిధులు ప్రత్యక్షం గా పరిశించారని, ఏ ప్రాంతం అందుకు అనువుగా ఉంటుందో గుర్తించాలని మేయర్ వారికి సూచించారు.మేయర్ ఛాంబర్ లో సమీక్షించిన అనంతరం ఏజెన్సీ ప్రతినిధులు మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మ్యూజికల్ ఫౌంటెన్ ఏర్పాటు తీరు విధానాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సత్యనారాయణ, ఈ ఈ రవి కుమార్, మాధవి లత, డి ఈ లు రాగి శ్రీకాంత్, సంతోష్ కుమార్ ఏ ఈ లు సరిత నరేష్ ఏజెన్సీ ప్రతినిధి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రొమాంటిక్ హీరోతో కోలీవుడ్ ఎంట్రీ

# ఇవ్వబోతున్న మృణాల్!

'సీతారామం, ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ సుపరిచితురాలే. అయితే మృణాల్ ఠాకూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వచ్చిందట. శింబు హీరోగా తమిళంలో 'ఓ మై కడవులే, డ్రాగన్ (తెలుగులో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ 'గా విడుదలైంది)' వంటి సక్సెస్‌ఫుల్ సినిమాలకు దర్శకత్వం వహించిన అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఏజీఎస్ ఎంటర్‌టైన్ మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు మృణాల్ ఠాకూర్‌ను ఎంపిక చేసుకున్నారట చిత్రం యూనిట్. మృణాల్‌కు ఆల్రెడీ మేకర్స్ ఈ సినిమా కథ వినిపించారని, ఆమె ఈ సినిమాలో నటించేందుకు ఆల్మోస్ట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది.

ఒకవేళ ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ నటించనున్న విషయం అధికారికంగా వెల్లడైతే, మృణాళ్‌కు తమిళ్‌లో ఇదే తొలి చిత్రం అవుతుంది. మరి..ఈ సినిమాతోనే మృణాల్ కోలీవుడ్ ఎంట్రీ జరుగుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న సినిమా, అడవి శేష్ హీరోగా చేస్తున్న 'డెకాయిట్' చిత్రాలతో మృణాల్ ఠాకూర్ బిజీగా ఉన్నారు. అలాగే ఆమె హిందీలో నటించిన 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఈ ఫిబ్రవరి 20న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ చిత్రాలే కాదు..మరికొన్ని హిందీ చిత్రాల్లోనూ ఆమె నటిస్తున్నారు.

ప్రియాంకా చోప్రా లైఫ్ జర్నీ నాకు స్ఫూర్తి: మృణాల్ ఠాకూర్
బాలీవుడ్ సక్సెస్‌ఫుల్ టాప్ హీరోయిన్ ప్రియాంకా లైఫ్ జర్నీ అంటే తనకు ఎంతో ఇష్టమని చెబుతున్నారు మృణాల్ ఠాకూర్. ఈ అంశంపై ఇటీవల ఆమె ఇంటర్వ్యూలో స్పందించారు. “సినీ ఇండస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండ సినిమాల్లోకి వచ్చారు ప్రియాంకా చోప్రా ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని, కష్టపడి గ్లోబల్ రేంజ్ హీరోయిన్ గా రాణిస్తున్నారు. అలాగే ప్రియాంక చోప్రా యువతకు ఇచ్చే సూచనలు, సలహాలు నాకు చాలా ఇష్టం. ఇలా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన ప్రియాంకా చోప్రా నాకు కూడా స్ఫూర్తి. నా ప్రయాణం, ప్రియాంక చోప్రా ప్రయాణం పూర్తిగా భిన్నమైనవి. కానీ మా ఇద్దరి మధ్యలో ఓ కామన్ పాయింట్ ఉంది. ఇద్దరం కూడా కష్టకాలంలో ఎక్కడా వెనకడుగు వేయకుండా కృషి, పట్టుదలతో ముందుకు వెళ్తున్నాం” అని చెప్పారు మృణాల్.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com